Life is short - Art is long

64కళలు.కామ్

www.64kalalu.com

సకల కళల సమాహారం


నవంబరు 2010

ప్రారంభ సంచిక





నాగురించి నేను...
రాగతి పండరి



అంతరంగాన అలజడి
కాళ్ళ చిత్రావళి

దీపావళి శుభాకాంక్షలతో...



64కళలు.కామ్ www.64kalalu.com
సకల కళల సమాహారం

సంపుటి :1 సంచిక :1 నవంబరు 2010

సంపాదకీయం

ఏ జాతికైనా సంస్కృతీ-కళలే ప్రాణనాడి.

ఆ నాడీ స్పందనే జనజీవితంలో జవసత్వాలను నింపుతుంది.

ఆ సంస్కృతి విశిష్టత-కళావారసత్వ సంపద జాతికొక ఔన్నత్యాన్ని ప్రత్యేక గుర్తింపును సమకూరుస్తుంది.

నేటి మన యాంత్రికజీవితంలో దురదృష్టవశాత్తు సాంస్కృతిక -కళలపట్ల, లలితకళాస్వాదన పట్ల ఆశక్తి, అనురక్తి తగ్గుతూ వస్తున్నాయి.

ఈ వాతావరణంలో మన జన జీవనంలోని వివిధ పార్శ్వాలను స్పృశిస్తూ, సంస్కృతి, లలితకళలపట్ల ఆశక్తిని కలిగిస్తూ, విలువైన సమాచారం అందించే వ్యాసాలను, వివిధరంగాల కళాకారుల పరిచయాలు ఉత్తమ అభిరుచులు గల పాఠకులకు కోసం అందించే ప్రయత్నంచేస్తూంది 64కళలు.కామ్.

భూగోళమంతటినీ ఒక్క మౌస్ క్లిక్‌లోకి కుదించేసిన ఇంటర్నెట్ ఆధునిక మానవ జీవితంలోని అన్ని రంగాలపై తన ప్రభావాన్ని చూపించినట్లు, పత్రికారంగంలో కూడా పెనుమార్పులకి కారణమైంది. పెరిగిన సాంకేతిక విజ్ఞానం దృష్ట్యా ప్రపంచంలోని ఏ ప్రాంతం నుంచైనా ఇంటర్నెట్‌లో తెలుగు పత్రికలు ప్రచురించే వీలు కలిగింది. ప్రింట్ మేగజైన్లతో సమంగా నేడు వెబ్‌మేగజైన్లకు పాఠకులున్నారంటే అతిశయోక్తికాదు. మా 64కళలు.కామ్ స్థాపన ముఖ్యోద్దేశ్యం వేలమైళ్ళదూరాన ఉన్న తెలుగువారికి మన సంస్కృతిని-కళలను, కళాకారులను పరిచయం చేయాలన్నదే. తెలుగులో సంస్కృతి - కళలకోసం ప్రత్యేకించి వచ్చిన ముద్రిత పత్రికలు బహుతక్కువ. అందులో ముఖ్యంగా చలసాని ప్రసాదరావుగారి సంపాదకత్వంలో వచ్చిన కళ మాకు ప్రేరణ.

ఎలాంటి‘ లాభాపేక్షలేకుండా, కేవలం కళాసాహిత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా వున్న తెలుగు కళాప్రియులకి అందించడమే 64కళలు.కామ్ ముఖ్యోద్దేశ్యం. కేవలం హాబీగా ప్రారంభించినా, నెల నెలా ఇన్ని పేజీల రంగుల పత్రికను కళాత్మకంగా రూపొందించడం ఎంత శ్రమతో కూడినదో మీకు తెలియనిదికాదు. ఈ ప్రయత్నంతో తమవంతు సహకారాన్నందిస్తున్న మిత్రులందరికీ కృతజ్ఞతలు.

మా ప్రయత్నం గురించి తెలిసిన హితులూ, మిత్రులూ, కళాభిమానులు, కళాకారులు మాకు శుభాశీస్సులనందించి, ఆశీర్వదించారు. వారందరి అభిమానం, పాఠకుల అభిమానమే 64కళలకు బలం. మేము తీసుకొన్న లలితకళల పరిధి అనంతమైనది. అన్ని విషయాలు ప్రతీనెలా ఉ ఒడకపోయినా-ప్రతీనెలా ఏవోకొన్ని కళాంశాలపై వ్యాసాలు ఇవ్వడం జరుగుతుంది. మొదటి సంచికపై, మీ స్పందనని తెలియజేయండి. మీ నుంచి అందే నిర్మాణాత్మకమైన విమర్శలే 64కళలు.కామ్‌ను కళాప్రపంచంలో వెలుగొందేలా చేస్తాయి. అమూల్యమైన మీ ప్రతిస్పందనకోసం ఎదురుచూస్తూ...

కళాసేవలో... *దీపావళి శుభాకాంక్షలతో...*

కళాసాగర్
ఎడిటర్-64కళలు.కామ్

ఈ సంచిక లోని రచనల్లో ఆయా రచయితలు వెలిబుచ్చిన భావాలు వారి సొంత భావాలు మాత్రమే

ముఖచిత్రం చిత్రకారుడు : కప్పరి కిషన్



వెంటపల్లి సత్యనారాయణ

అంతరంగాన అలజడి కాళ్ళ చిత్రావళి




దాదాపు 75 ఏళ్ళ క్రితం "నవకవిత" పేరుతో మహాప్రస్థానంలో రాసాడు శ్రీశ్రీ. కదిలేదీ, కదిలించేది, మారేది, మార్పించేది, పాడేది, పాడించేది పెనునిద్దర వదిలించేదీ, మునుముందుకు సాగించేదీ, పరిపూర్ణపు బ్రతుకిచ్చేవీ కావాలోయ్ నవ కవనానికంటూ...

సాహిత్యానికి సమాజాన్ని తట్టిలేపే గుణం కావాలంటూ ఆయన ఎప్పుడో రాసారు. అయితే ఆ లక్షణం ఒక్క సాహిత్యానికే పరిమితం కావాలా? మిగితా కళలైన సంగీతం, చిత్రలేఖనం, శిల్పకళ, నాటకం తదితర కళారూపాలకు వర్తించదా? అంటే... అసలు కళయొక్క నిజమైన పరమార్ధం ఏమిటి? అని ఆలోచించినపుడు వ్యక్తి తనలోని కలిగిన ఆలోచనలకు అనుభూతులూ, భావాలను తనదైన శైలిద్వారా ప్రతిభావంతంగా బయటకు వ్యక్తంచేయడం ద్వారా తోటి ప్రేక్షకులను రంజింపజేయడం ఒక ఎత్తైతే ఆ కళారూపం ద్వారా రంజింపజేయడంతోపాటు ఆలోచింపజేయటం, తద్వారా సమాజంలో మార్పు రావాలని అలోచించడం రెండో ఎత్తు. మొదటిది వేయటం, రెండో దానిలో చేయడంతోపాటు చేయించడం అనే ప్రకియ కూడా ఇమిడి వుంది. అందుకే మొదట విదానం కంటే రెండవది ఉత్తమమైనది. అలాంటి ఉత్తమ లక్షణానికి చెందిన అపురూప చిత్రకారుడే "కాళ్ళ" అనిపిలవబడే కాళ్ళ సత్యనారాయణ.

అది 1998 సం॥,. నవంబర్ నెల ఉద్యోగరీత్యా అప్పుడే నేను ఖమ్మం వచ్చిన రోజులు. స్పందన హాస్పిటల్‌లో ఏదో చిత్రకారుని "వన్‌మేన్‌షో" జరుగుతుందని తెలిసి మిత్రుడు సుబ్బారావుతో కలిసి ఒక సాయంత్రం వెళ్లాము. అందమైన, ఆహ్లాదకరమైన చిత్రాలను చూపి స్థబ్దతంగా ఉన్న నాలోని చిత్రకారునికి స్పందన కలిగించాలనేది ఒక ఆలోచనైతే చిత్రాల అందాలను పూర్తిగా ఆస్వాదించి మనసంతా ఆనందంతో నింపుకోవాలనేది నా రెండో ఆలోచన. చిత్రకళాప్రదర్శనశాలలో ప్రవేశించాము. అంతా కలియతిరిగాను. అందమైన చిత్రాలకోసం అర్రులుచాస్తూ కానీ నేను ఆశించిన అలాంటి అందమైన చిత్రాలకు బదులుగా అంతటా ఆకలి కనిపించింది. అసలు చిత్రాలు ఆయన ఎక్కడ గీసాడాని కనిపించడానికి. అన్నీ భావాలూ,







ఆలోచనలూ తప్ప అందమైన చిత్రాలను చూసి వాటిలోని సౌందర్యాన్ని ఆస్వాదించాలని ఆరాటపడిన నా మనసులో ఆనందం ఆవిరైపోగా, దాని స్థానంలో ఏదో ఆవేదన, అలోచన, ఆశ్చర్యం నా హృదయంలో చోటుచేసుకున్నాయి.

కారణం ఆరోజు నేనా ప్రదర్శనలో చూసినవి మామూలు సుందర ప్రకృతి దృశ్యాలో, నిర్జీవమైన నిశ్చల చిత్రాలో, లేదా రాధాకృష్ణుల రాసలీలల లాంటి మామూలు చిత్రాలోకాదు. గుండెల్ని పిండేసే ఆలోచనల అంతరాంగాలకు పదునుపెట్టే వృదార్ధజీవుల యదార్ధ జీవన గాధలు ఆ చిత్రాలు.

కర్మాగార కర్కశ యంత్రాల మధ్య నలిగిపోయే బాలకార్మికులు, కాన్వెంట్ చదువుల భారాన్ని మోయలేని బాలబాలికలు, కామోద్రేకపు విషపు వీక్షణాలను భరించలేని అమాయకపు అమ్మాయిలు, మతం ముసుగులో జరిగే చాందస వాదపుమోసాలు, కామాందుల కౌగిలిలో నలిగిపోయే బాలికలు, చెరచబడ్డస్త్రీలు, గ్లోబలైజేషన్ విషవలయంలో కొట్టుకుపోయే వృత్తి పనివాళ్ళ, బహుళజాతి కంపెనీల మోసాలకు బలిపశువులయిన బడుగురైతులు, పత్తి రైతుల ఈతి బాధలు ఒకటేమిటి ఏచిత్రం చూసినా సమాజంలోని అసమానతలను, కుళ్ళు, కుతంత్రాలను ఎత్తి చూపిస్తూ ప్రేక్షకుల హృదయాలను చలింపజేసేవే. ఇలాంటి చిత్రాలను చూసిన ఏ ప్రేక్షకునికైనా అంతరంగాల్లో అలజడి, ఆందోళన రేకెత్తక ఆనందం ఎలాపుడుతుంది?

ఉలిదెబ్బతినని రాయి సమ్మెటపోటు చవిచూడని ఉక్కు శిల్పంగా,.. ఆయుదంగా ఎలా మారలేవో, జీవితంలో ఎలాంటి ఒడుదుడుకులు చవిచూడని వ్యక్తికూడా ఎగుడుదిగుడుల జీవన యానంలోని మాధుర్యాన్ని చవిచూడలేడు. ఎవరైతే వాటిని అనుభవిస్తారో అలాంటివారే బ్రతుకు పోరులోని సంఘర్షణలను సమర్ధవంతంగా బయటకు ఏ మాధ్యమం ద్వారానైనా వ్యక్తంచేయగలరు.

కాళ్ళ అలాంటి ఎన్నో ఒడుదుడుకులను తన జీవితంలో చవిచూసాడు. ఎన్నో సంఘర్షణలను అనుభవించాడు. కాబట్టే అతని చిత్రాలు మామూలు చిత్రకారుల చిత్రాలకు మల్లే ఆనందభరితంగానో లేదా

ఆహ్లాద భరితంగానో కాక చూసే వారికి ఒక విధమైన ఉద్వేగాన్ని ఆలోచనను, ఆవేశాన్ని రేకెతించే విధంగా ఉంటాయి. సుధీర్ఘ అనుభవం గల కుంచెను, భావగాంభీర్యత గల హృదయంలో ముంచీ సర్రున గీస్తే సూటిగా ఆ రేఖ ప్రేక్షకుని హృదయానికి తాకకుండా ఎలా వుంటుందీ? కాళ్ళ చిత్రాల్లోని రేఖలు ఏ ప్రేక్షకునికైనా అలాంటి అనుభూతినే కలిగిస్తాయి. సమర్థవంతమైన ఆ రేఖలలోని భావానికి ఊతంగా ప్రేక్షకుని విస్మయ పరిచేలా వుండే అద్భుతమైన టెక్చర్ ఆ చిత్రానికి ఆవల ఒక గంభీరతను తీసుకొచ్చే విధంగా వుంటుంది.

పుట్టిన ప్రతి మనిషీ తన మనుగడకు ఎన్నో పనులు చేస్తాడు. అది ఉద్యోగం, వ్యాపారం, మరింకేదైనా... ఎన్ని చేసినా, ఏంచేసినా మనిషి తన కోసం, తనవాళ్లకోసం, సమాజంలో తమ ఉన్నతి కోసమే ఏపనైనా చేస్తాడు. తద్వారా సంఘంలో ఒక గౌరవప్రధమైన జీవితాన్ని కొనసాగించాలని, గొప్పగా, జల్సాగా, ఐశ్వర్యవంతంగా బ్రతకడానికే ఎవరైనా ప్రయత్నంచేస్తారు. వాళ్ళకూడా ఆవిధంగానే చేసాడు. చేస్తాడు. అది రిక్షా తొక్కడం మొదలు స్క్రీన్‌ప్రింటింగ్ వరకూ ఏపనైనా త్రికరణ శుద్ధిగా, నిజాయితీగా, చిత్తశుద్ధితో చేసాడు. చేస్తాడు. సమాజం దృష్టిలో తక్కువగా అనిపించే పనులు సహితం గతంలో అతను చేయడానికి వెనుకాడలేదు అయితే అతను కేవలం బ్రతుకుతెరువు కోసం కంటే తన ఆత్మసంతృప్తిని నింపుకొనేందుకే అలాంటిపనులు ఎన్నోచేసాడు. ఆ పని ద్వారా వచ్చిన డబ్బుతో తిండికంటే అతను రంగులూ, బ్రష్‌లూ కొనేందుకే ఇష్టబడ్డాడు. కారణం అది అతని బలహీనత.

జీర్ణక్రియ ముగిసిన పిదప విసర్జన క్రియ జరగకపోతే మనిషి ఎంత అసౌకర్యానికీ, ఇబ్బందికీ గురి అవుతాడో అంత ఇబ్బందినీ బొమ్మవేయకపోతే తాను గురౌతానని నిక్కచ్చిగానే కాదు, అత్యంత పచ్చిగా మనకు చెప్తే మనం విస్తుపోయి చూడక తప్పదు. నేను నా మిత్రుడు రాజారాంబాబు ఈ పరిస్థితిని ప్రత్యక్షంగా ఎదుర్కొన్నాం కనుక నేను ఈ మాట రాస్తున్నాను.

పుట్టింది ఉత్తరాంధ్ర విజయనగరంలో 1948 ఏప్రిల్



రచయిత తో
చిత్రకారుడు కాళ్ళ









10న పైడమ్మ, సన్యాసి దంపతులకు, పెరిగింది గోదావరిజిల్లా ఏలూరులో కానీ స్థిరపడింది తెలంగాణా జిల్లా ఖమ్మంలో. మానవ సంబంధాలన్నీ మనీతో ముడిపడిన నేటి లోకంలో కూడా డబ్బుకు ఏమాత్రం లొంగని వ్యక్తి, మనసుకు వెన్నలా కలిగిపోయే మంచులాంటి వ్యక్తి, చింపిరి జుట్టు. మాసిన గడ్డం జీవితంలో సకల బాధలు, వేదనల ఫలితంగా వచ్చిన నిర్వేదం కాబోలు వంటి మీద ఏమీ శ్రద్ధ లేకపోవడం ఇదీ ఆయన రూపం.

కాళ్ళ చిత్రకళాప్రదర్శన అయిన తరువాత దాదాపు 5,6, సంవత్సరాలు నేను ఖమ్మంలోనే ఉన్నాను. ఆయనను కలుసుకోవాలని పాత సిపియమ్ ఆఫీసువద్దకు చాలా సార్లు తిరిగేవాన్ని కానీ ఆయన ఉంటాడు అని చెప్పే అక్కడి కళాగ్రాఫిక్స్ షాప్ షట్టర్ ఎప్పుడూ మూతపడే వుండేది. నిజానికి రోడ్డుమీద దుమ్ము పడకుండా షట్టర్ మూసేసి ఆ ఇరుకు గదిలో లోనే పనిచేస్తూ వుంటారనే విషయం నాకు మొన్నీమధ్యనే తెలిసింది.

ఆ తర్వాత 2006 సెప్టెంబర్ నెలలో ప్రత్యక్షంగా ఆయనను కలుసుకునే అవకాశం నాకు దక్కింది. నా మిత్రుడు హ్యారీనవీన్ నేను కలిసి క్లాసిక్‌ఫైనార్ట్స్ షో పేరిట చిత్రకళాప్రదర్శన పెట్టే సందర్భంలో ఆయన సలహాకోసం వెళ్లాము. అపుడు ఆయనవర్క్ చేసే ఆ ఇరుకు బడ్డీ కొట్టులాంటి అతని వర్క్‌షాప్ చూసాను. ఒక్కసారిగా మతిపోయినంతపనైంది. ఈ ఇరుకు గదిలో వుండే ఈయన ఇంత గొప్ప చిత్రాలు వేస్తున్నాడే అని. హ్యారీ నన్నాయనకు పరిచయం చేసాడు. అంతే ఇక మా మధ్య మాటల ప్రవాహం. చాలా ఆప్యాయంగా రంగుల లోకం గురించి ఎన్నో విషయాలను మాట్లాడుకున్నాం.

ఈ విశాల ప్రపంచంలో వుంటూ అపార జ్ఞానవంతులం అనుకుంటున్న మా లాంటి వాళ్లకు ఆ ఇరుకుగదిలో వుంటూ ఎప్పుడూ పనిలో మునిగిపోయే ఆయన ఎన్నో జాతీయ, అంతర్జాతీయ విషయాల గురించి చెప్తారు. బోపాల్‌గ్యాస్ గురించి లాతూర్ భూకంపం గురించే కాదు. ఇరాన్ యుద్దాల గురించి, పెడరల్ కాస్ట్రోలాంటి అంతర్జాతీయ వ్యక్తులు విషయాలను గురించి కూడా మాట్లాడతాడు. అందుకు స్పందించి వేసిన బొమ్మలను కూడా చూపిస్తాడు. ఎదురుగా కూర్చున్న మనం ఆశ్చర్య పోయే స్థితిలో వుంటే విన్సెంట్ వాంగోనో, పికాసోనోలేదా సాల్విడార్ డాలీ గురించో చెప్పి మరింత విస్మయ పరుస్తాడు. ఏమిటి మీకిన్ని విషయాలు ఎలా ఎలా తెలుసు అంటూ ప్రశ్నిస్తే ది హిందూ కార్టూనిస్ట్ సురేంద్ర, ప్రఖ్యాత చిత్రకారుడు, కార్టూనిస్ట్ మోహన్ గురించి, లేదంటే ఇండియా టుడే నర్సిం గురించి చెప్తాడు. హృదయాలను కదిలించే విధంగా ఆయన చిత్రాలు ఎలా వుంటాయో ఆయన చిత్రాలకు పెట్టినపేర్లు కూడా అంతే గొప్పగా వుంటాయి. ది బ్రోకెన్ మిర్రర్, ఫ్రోజన్ టియర్,

డైయింగ్‌ఎలోన్, ప్రిజన్‌అండ్‌కీ, నౌ, ఎవర్‌జీసస్ దిస్ట్రా, తెగిన దారం, రూదిపింజ, మాతృభంగం లాంటి చిత్రాలకు ఆయన చక్కని పేర్లు పెట్టారు.

దాదాపు ముప్పైఏళ్ళ క్రిందట డా॥హరీష్‌గారు కౌముది సరిత అనేపేరుతో ఒక మాసపత్రిక తెచ్చే విషయమై ఆర్టిస్ట్ కావల్సి వచ్చి ఏలూరు నుండి తనను పిలిపించారని, ఏ కారణంగానో ఆ పత్రిక మాత్రం రాలేదు గానీ తను మాత్రం అప్పటినుండి ఇక్కడే (ఖమ్మంలో)ఉండిపోయాననీ, అప్పటినుండి ఇప్పటివరకూ డాక్టర్ హరీష్‌గారే అన్నీ అయి తనను ఆదుకుంటున్నారని, తాను వేసిన చాలా చిత్రాలకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ప్రేరణ డాక్టర్ హరీష్ గారే అని అంటాడు కాళ్ళ. అంతే కాదు డాక్టర్ గారే తనకు గురువు, దాత, ఆదర్శ ప్రేమికుడు అని ఒకానొక సంధర్భంలో చెప్పుకున్నారు కాళ్ళ.

అంతటి దాత ఆయనకు అండగా నిలవబట్టే కాళ్ళ స్వేచ్ఛగా ఏ బాధలూ లేకుండా తన యొక్క భావాల పరంపరను చిత్రాల రూపంలో కాన్వాస్‌పై వర్గీకరించగలిగాడు. కానీ తనకు వెన్నెముకై నిలిచి బ్రతుకు పోరులోని అటుపోటులెన్ని ఎదురయిన జీవించడానికి కావల్సిన మనోధైర్యానిచ్చిన ఆ మహామినిషి డాక్టర్ హరీష్‌గారు ది. 22.09.2006 నాడు అకస్మికంగా కాళ్ళను వదిలి శాస్వతమైన లోకాలకు తరలిపోవడంతో కాళ్ళను తీవ్రవేదనకు గురిచేసింది. హరీష్ గారి మరణం వ్యక్తిగతంగా కాళ్ళకు తీరనిలోటు. అందుకే ఆయన స్మృత్యర్థం మానవ సంబంధాలపై మేన్ విత్ యూరివర్స్, మేన్‌విత్‌నేచర్, మేన్ విత్ మదర్, మేన్ విత్ బ్యూటీ, మేన్‌విత్ డెత్, పేర్లతో నవరత్నాలాంటి తొమ్మిది పెద్ద చిత్రాలను వేసి డాక్టర్ హరీష్ గారికి అంకితమిచ్చారు. వీటిని నేడు మనం ఖమ్మం కొత్త సి.పి.యమ్. ఆఫీసులో చూడవచ్చు.

హరీష్‌గారు బ్రతికివున్నంతకాలం బ్రతుకు భారం ఆయనపై వేసుకోవడంతో ఏకాంతంగా తన పని చేసుకోవడానికుపయోగించుకున్న కళాగ్రాఫిక్స్ పేరున గల పాత సి.పి.యమ్ ఆఫీసులో తీసుకున్న గదిని డాక్టర్ గారి మరణాంతరం ఆయనను ఆదుకొనేవారు లేకపోవడంతో



ఖాళీచేయకతప్పలేదు.

ప్రస్థుతం ఆయున ఖమ్మంకి దగ్గరలో పాండురంగాపురం అనే ఊర్లో ఒక చిన్న ఇంట్లో ఉంటున్నారు. మొన్ననే నా మిత్రుడు బీర శ్రీనివాస్ నేను కలిసి కాళ్ళ గారింటికి వెళ్లాము. జీవితకాలానికి సరిపడ వేసుకున్న ఆయున చిత్రాలను చూసి ఇంతగొప్ప చిత్రకారునికి రావల్సిన గుర్తింపు రాలేదే అని చాలా విచారించాము. కాళ్ళపిల్లలు ఇద్దరు కళారంగంలోనే విద్యాభ్యాసం చేసి ప్రస్తుతం హైదరాబాద్‌లోనే ఉంటుండగా ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉన్న తన భార్యకు సేవచేస్తూ, ఖాళీ ఉన్నప్పుడు చిత్రాలను గీస్తూ నిర్వేదంగా కాలం గడుపుతున్నాడు.

అందుకే అప్రతిహతం, అనితరసాధ్యం అయిన అతనిలోని కళాసౌరభం ఇంకా నిరంతరంగా కొనసాగాలి అంటే హార్ధికంగానే కాదు ఆర్ధికంగా కూడా చేయూతనిచ్చే అండ అతనికి కావాలి. అందుకే మరొక హరీష్ కోసం అతని నిరీక్షణ.

మరి ఆ నిరీక్షణ ఫలించాలనీ, ఫలిస్తుందని, కాళ్ళ కుంచె కాన్వాస్ ఆకాశంపై హరివిల్లును మించిన వర్ణాలను విరజిమ్మాలనీ ఆశిద్దాం.

నా గురించి నేను...

కుమారి రాగతి పండరి

తొలి తెలుగు మహిళా కార్టూనిస్టుగా గత నాలుగు దశాబ్ధాలుగా పాఠకులను అలరిస్తున్న కుమారి రాగతి పండరి తన జీవన గమనాన్ని - కార్టూనిస్టుగా స్వయంకృషితో ఎదిగిన వైనాన్ని "నా గురించు...నేను" పేరుతో అక్షరీకరణ చేసారు. 64కళలు.కామ్ లో ధారావాహిక రూపంలో నెల-నెలా ...



కుమారి రాగతి పండరి

సాయంత్రం అయిదయింది. సూర్యుడి ఎండ ప్రతాపం తగ్గి కాస్త చల్లబడింది. అప్పుడప్పుడు చల్లగాలి మెల్లగా వీస్తుంది. కాగితం కలం పట్టుకుని డాబా మీద కూచున్నాను. కార్టూన్లు గీయటానికి కాదు 'కళ' మాసపత్రిక వారు నా గురించి నన్నే రాసి ఇవ్వమన్నారు. అంటే 'నా గురించి నేనే' రాసుకోవాలన్నమాట. నా గరించి నేను రాయటానికి ఎంతో ఉంది అనిపిస్తుంది ఓ వైపు నా గురించి నేను ఏమిరాయాలి?

నా మనసు అట్టడుగు పొరల్లో మసగ మసగ్గా వున్న బాల్యం తాలూకు జ్ఞాపకాలు బాల్యం వీడని వయసు నుండే కార్టూన్లు కలంచేత బట్టిన వైనం.

ఎక్కడో చదివాను - బ్రహ్మదేవుడి అత్యద్భుత సృష్టిలో అత్యంత సుందరమైనది మానవ శరీరం. అటువంటి మనోహర మానవాకృతిలోని సౌందర్యాలను మృదుమధురంగా రేఖా బద్ధంచెయ్యటమే చిత్రకళ. ఈ చిత్ర కళలోంచి పుట్టినదే వ్యంగ్య చిత్రకళ రవ్వంత హాస్యం. చిటికెడు అతిశయోక్తి, చెంచాడు వ్యంగ్యం జతచేసి గీసినదే కార్టూన్ చిత్రకళట.

అటువంటి వాటికి అర్థం తెలియని వయసులో నేనీ కార్టూన్ రంగంలోకి అడుగుపెట్టాను. అప్పుడు చిత్రకళలో రవ్వంత అనుభవం లేకపోయినా కొండంత ఆసక్తి వుండేది నాకు. బుర్రలో అర్ధం పర్ధం లేని ఐడియాలు పుట్టుకొచ్చేవి. అందులోనే అడపాతడపా హాస్యం పుట్టించేవీ ఆలోచింపచేసేవీ లేక పోలేదు.

కార్టూన్లు గియ్యాలనే కోరిక, తపనా, ఆసక్తీ వుంటే చాలు స్వయం కృషితో, అకుంఠిత దీక్షతో సాధించవచ్చు అనటానికి నేను ఒక కార్టూనిస్టుని కావటమే నిదర్శనం.

ఆ రోజుల్లో మగ కార్టూనిస్టులే రాజ్యం చేస్తున్న కార్టూన్ ప్రపంచంలో ఇంకా ఆడవాళ్ళు ప్రవేశించని కార్టూన్ జర్నలిజంలో మొట్టమొదటి తెలుగు లేడీ కార్టూనిస్టుగా ప్రవేశించి నిలదొక్కుకుని రాణించటం - ఓహ్! మరపురాని అనుభూతి నాకు.

ఈనాడు ఒక మంచి కార్టూనిస్టుగా పేరు తెచ్చుకోవటం వెనుక నాకు ఆ భగవంతుని దయతో పాటూ ఇంటా - బయటా ఎందరో ప్రోత్సాహాలూ, ఆప్యాయతలూ, అనురాగాలూ, ఆదరణలూ నన్నీ స్థితికి తెచ్చాయ్...

ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు...

అసలు నేనొక కార్టూనిస్టుని అవుతానని, పేరు తెచ్చుకోగలనని అనుకోలేదు. తెలిసీ తెలియని వయసులో ప్రారంభించిన ఈ కార్టూన్లు నా జీవితానికిలా అల్లుకుపోతాయని ఊహించలేదు. అన్ని హంగులూ వుండి వినోదంగా జీవితం గడిపేవాళ్ళు, హాస్యరసాన్ని వెదజల్లగలిగే వాళు కార్టూన్లు గియ్యగలిగే అవకాశం ఉంటుంది. అనుకోవటానికి భిన్నమైన పరిస్థితులలో వుండి కూడా నిరాశా నిస్పృహలకు తావీయకుండా చిత్ర స్థైర్యంతో నా లాంటి వారూ కూడా కార్టూన్ల కన్నా నాకు బొమ్మలు వేయ్యటం మీదే ఆసక్తి ఎక్కువ. ఇకపోతే నా గతం గురించి కొద్దిగా.. మాది పూర్వం చాలా రిచ్ ఫ్యామ్లీ అట. అప్పుడు విశాఖలో పేరు మోసిన కొద్దిమంది ధనవంతులలో మాదీ ఒకటట. మా తాతగారు రాగతి రాజారావు నాయుడు గారంటే ఊళ్లో గొప్ప వ్యక్తిగా పేరట. ఆ రోజుల్లో విశాఖట్నంలో నాలుగైదు సొంత భవనాలూ, చీపురుపల్లీ, పరవాడ, అనకాపల్లీ లాంటి చోట్ల భూములూ, బిజినెస్‌లూ వుండేవట. దాన ధర్మాలతో పాటూ అడిగిన వారికి లేదనకుండా మాటసాయం, ఆర్థికసాయం చేసేవారట మా పెద్దలంతా.

మా నన్నగారు గోవిందరావు గారు, అమ్మ శాంతకుమారి

పల్లెటూరిలో పెద్ద మోతుబరుల ఇంట పుట్టి పెరిగినా అమ్మ పెద్దగా చదువుకోలేదు. పేరుకు తగ్గట్టు శాంతస్వభావురాలు. మానాన్న గారి టైములో వివిధ బిజినెస్‌లలో నష్టాలూ, కొందరు స్వార్థపరుల మోసాలతో చాలా ఆస్తులు కోల్పోయి చివరికి సామాన్యులుగా మిగిలిపోయాం అట.

ముందు అక్క ఆ తరువాత అన్నయ్య మళ్ళీ ఇద్దరు అక్కలూ ఆ తరువాత నేనూ 1965 జూలై 22వ తేదీన పుట్టాను (ట). పెద్దక్క పేరు రాజా సుందరి, అన్నయ్య పేరు రామరాజు, తర్వాత అక్క పేరు రత్నకుమారి, తర్వాత అక్క పేరు రమాదేవి. నేను పుట్టిన ఏడాదికే పోలియో విషసర్పమై నన్ను కాటేసి అందరిలా నడిచే అదృష్టాన్ని లేకుండా చేసింది. ఆ తరువాత రెండేళ్లకి నాన్న గారి మరణం నా జీవితంలో చిన్నప్పుడే జరిగిన రెండు విషాదాలు. నాన్న ఉన్నప్పుడే పెద్దక్క పెళ్ళి అయిపోవటం తను వెళ్ళిపోవటము జరిగిపోయింది.

ఇంట్లో అందరూ చదువుకునేందుకు వెళ్ళిపోతే, ఇంట్లో అమ్మా, నేనూ మిగిలేవాళ్ళం. నన్ను స్కూల్లో చేర్పించాలనీ, చదివించాలనీ ఇంట్లో ఎవరూ అనుకోలేదు. ఆలోచించలేదు. తీరికటైములో నాకు రెండో అక్క చదువు చెప్పేది. అలా చదవటం, రాయటం చిన్న చిన్న పుస్తకాలు చదివి అర్థం చేసుకోవటం నాకు అలవడింది. ఆరేళ్ల వయసులో బైట వాళ్ల సలహాతో అమ్మ నన్ను కె.జి.హెచ్.లో చూపించింది. కాళ్లకి ఆపరేషన్ చెయ్యాలన్నారు. ఆ తరువాత డాక్టర్ వ్యాఘ్రేశ్వరుడు (ఆర్థోపెడిక్) నాకు ఆపరేషన్ చేసారు. ఆర్నెల్లలో కాలిపర్స్ వేసి నిలబెట్టారు. అలా కొద్ది కొద్దిగా ఇంట్లోనే నడవటం ప్రాక్టీసు చేస్తూ ట్యూషన్ ద్వారా చదవటం ప్రారంభించాను. మా ఇంట్లో అందరూ మొదట్నుంచీ సాహిత్య ప్రియులే. ఏ కొంచెం సమయం చిక్కినా అందరూ బుక్స్ చదవడం హాబీ. అమ్మకూడా వంటయ్యాక కథల పుస్తకాలు చదువుతుండేది. అప్పుడు ఆంధ్రప్రభ వీక్లీ, పత్రిక వీక్లీ, ఆంధ్రజ్యోతి వీక్లీ, యువ, జ్యోతి మొదలైన బుక్స్ వచ్చేవి. కొన్ని కొనేవాళ్లం. మరికొన్ని ఫ్రెండ్స్ దగ్గర నుంచి తెచ్చే వాళ్లం. నేను అదేపనిగా చూడడం, అందులో కార్టూన్లను మెల్లమెల్లగా అర్థం చేసుకొంటూ చదవడం చేసేదాన్ని. చదువుకన్నా ఇలాంటి పుస్తకాలు చదవడమే నాకు ఇష్టంగా ఉండేది.


మరో ఏడాదికి నా పనులు నేను చేసుకోవడం, ఇంట్లో బాగానే నడవడం అలవాటైంది. బయటకు వెళ్లడం ఇష్టముండేది కాదు. ఎప్పుడైనా అమ్మ వాళ్లతో సినిమాకు వెళ్లడం తప్పితే. ఆ సమయంలోనే పత్రికల్లో కార్టూన్లు చూడగా, చూడగా నాక్కూడా కార్టూన్లు గీయాలన్న కోరిక చిన్నగా మొదలై, ఇంతై, అంతై ఎంతో ఎదిగిపోయింది.

ఆ సమయంలో పత్రిక వీక్లీ, యువ, జ్యోతి లాంటి పత్రికల్లో శ్రీ జయదేవ్‌గారి కార్టూన్లు ఎక్కువగా వచ్చేవి. నీట్‌గా స్పష్టంగా చూడముచ్చటగా ఉండే ఆయన బొమ్మలు అద్భుతంగా ఆకట్టుకున్నాయి.

వచ్చీరాని ఊహలతో, వంకర టింకర బొమ్మలతో నేను రఫ్ పేపర్లమీద కార్టూన్లు గీయడానికి శ్రీకారం చుట్టాను. ఒక రఫ్ బుక్ తీసుకొని అందులో శ్రీ జయదేవ్‌గారి కార్టూన్లు చూస్తూ బొమ్మలు ప్రాక్టీస్ చేసేదాన్ని. ఆయన కార్టూన్లు చూస్తుంటే నాలో కార్టూన్లు గీయాలన్న కోరిక కలిగింది.

కార్టూన్లు తిరిగి వచ్చినా నాలో నిరాశ కలిగేది కాదు. పైపెచ్చు ఇంకా పట్టుదల పెరిగేది. రఫ్‌బుక్కులో అలా నిరంతరం కార్టూన్లు వేసుకొంటూ మళ్లీ అవి డ్రాయింగ్ పేపరు ముక్కల మీద ఇండియన్





నా కార్టూన్లలో తప్పులు ఏమిటో తెలుసుకోనేందుకు నా కిష్టమైన జయదేవ్ గారికి లెటర్ రాస్తే... కానీ జయదేవ్ గారు ఎక్కడ ఉంటారో, ఏంచేస్తుంటారో నాకేమీ తెలుయదాయే... ఎలా... అన్నయ్య ఓ సలహా ఇచ్చాడు. పత్రిక అడ్రస్‌కు లెటర్ రాస్తే వాళ్లే ఆయనకు ఆ ఉత్తరం పంపిస్తారని చెప్పాడు. అంతే మరి ఇంకేం నేను వెంటనే రంగంలోకి దిగాను. నా కార్టూన్లలో మంచి మంచివి ఎంచి ఒక అయిదు డ్రాయింగ్ పేపర్లమీద ఇండియన్ ఇంకుతో వేశాను. తప్పులు రాకుండా కేప్షన్లు రాశాను. ఆ తర్వాత ఒక తెల్లకాగితం మీద పొందిగ్గా లెటర్ రాశాను. గౌరవనీయులైన శ్రీజయదేవ్ గారికి నమస్తే మీ కార్టూన్లంటే నాకు చాలా ఇష్టం పత్రికల్లో మీ కార్టూన్లు చూసి నేను కూడా ఒక కార్టూనిస్టు అవ్వాలని కార్టూన్లు గీయాలని కోరిక కలిగింది. నా కార్టూన్లు పత్రికల నుండి తిరిగొస్తున్నాయి. పెద్దగా పడడం లేదు. నా కార్టూన్లలో లోపం ఏమిటో నాకు తెలియడం లేదు. దయచేసి ఈ లెటర్‌తో పాటు పంపుతున్న నా కార్టూన్లలను పరిశీలించి తప్పొప్పులు తెలుప ప్రార్థన అంటూ రాశాను... అన్నయ్యకు చూపించి ఒకే చేసి పత్రిక అడ్రస్‌కు జయదేవ్‌గారి పేరుమీద పంపాను.

అలా రాసి పంపాక రోజు పోస్టు కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూసేదాన్ని జయదేవ్‌గారిని గురించి జాబు వస్తుందని, కానీ రాలేదు. చూసిచూసి నాకు కళ్లు అలసిపోయాయి. రోజులు, వారాలు, నెలలు గడిచిపోయాయి.నేను మాత్రం విసుగుచెందని విక్రమార్కుడిలా అలా కార్టూన్లు వేస్తూనే ఉన్నాను. పత్రికలకు పంపిస్తూనే ఉన్నాను. కొద్దికొద్దిగా పత్రికల్లో అవి వస్తూనే ఉన్నాయి. తినగతినగా వేము తియ్యనుండు అన్నట్టు వేయగావేయగా నాచేయి తిరిగింది. వంకర గీతలే అందమైన గీతలయ్యాయి. కార్టూన్లు, కాప్షన్లు తప్పులు లేకుండా నేనే రాసుకోగలుగుతున్నాను. మెల్లమెల్లగా నా బాణీ నాకు ఏర్పడుతోంది. అమ్మాయి బొమ్మలు అందంగా వేయడానికి ప్రయత్నిస్తున్నాను. అప్పుడు కూడా స్వాతి మంత్లీ వస్తుండేది. నేను ఎప్పుడు కార్టూన్లు పంపినా తిరిగి వస్తుండేవి. నాలో పట్టుదల పెరిగింది. వంద కార్టూన్లు కష్టపడి డ్రాయింగ్ పేపర్ కటింగ్స్ మీద వేశాను. ఇండియన్ ఇంక్ దిద్దాను. స్వాతి మంత్లీకి రిటర్న్ కవర్ జతచేసి వాటిని పంపాను. ఆ వంద కార్టూన్లలో సగానికి పైగా చెత్త కార్టూన్లు ఉండొచ్చు. ఎందుకంటే అప్పుడు నా ఐడియాల్లో మెచ్యూరిటీ అంతగా లేదు. కొన్నాళ్లకు స్వాతి నుండి నాకు కవర్ వచ్చింది నేను పంపిన రిటర్న్ కవర్‌లో నా కార్టూన్లు తిరిగి వచ్చాయి. కానీ అందులో పదిహేను వరకు కార్టూన్లు లేవు. అంటే స్వాతి వాళ్లు తీసుకొన్నారన్న మాట. ఆనందంతో పొంగిపోయాను. చాన్నాళ్ల తర్వాత ఒక రోజు శ్రీ జయదేవ్ గారి నుండి నా లెటర్‌కు జవాబు వచ్చింది. వణుకుతున్న చేతుల్తో కవరు విప్పాను.

మిగతా రాబోయే సంచికలో...

ఇంకుతో వేసి పత్రికలకు పంపిస్తుండేదాన్ని. 1972లో ఆంధ్రజ్యోతి వీక్లీలో నా మొదటి కార్టూను ఎనిమిదేళ్ల వయసులోనే పడింది. ఇక నా పట్టుదల, ఉత్సాహం రెట్టింపయ్యాయి. ఎలాగైనా సరే శ్రీ జయదేవ్‌గారి అంత చక్కగా నేనూ కార్టూన్లు వేయాలనుకొనేదాన్ని. ఆ తర్వాత ఆంధ్రజ్యోతి వీక్లీలో అప్పుడప్పుడు నా కార్టూన్లు ఒకటీ రెండు వస్తుండేవి. కొన్ని నెలలకు ఒకరోజు మామూలుగానే తెల్లారింది. ఉదయం పదకొండు గంటలైంది. ఇంతలో పోస్టుమెన్ మా తలుపుతట్టి లోనికి వచ్చాడు. ఆంధ్రజ్యోతి వీక్లీ నుండి నా పేరున నాలుగు రూపాయలు నా కార్టూనుకు రెమ్యునరేషన్‌గా మనియార్డర్ వచ్చింది. పోస్టుమేన్ నన్ను సంతకం పెట్టి రిసీవ్డ్ ఫోర్ రూపీస్ అని రాయమన్నాడు. నా మొదటి కార్టూన్ పడినప్పుడు కూడా నేనంత షాక్ చెందలేదు. నా పేర్న మనియార్డర్ రావడం నిజంగా నన్నెంతో ఆశ్చర్యానందాలకు గురిచేసింది. కార్టూన్ పడితే ఇలా పత్రికల వాళ్లు డబ్బులు పంపుతారని నాకసలు తెలియనే తెలియదు. సంతోషంతో నా బుర్ర పనిచేయడం మానేసింది.

అక్క పోస్టుమేన్ చేతిలో మనియార్డర్ ఫారం తీసుకొని సంతకం చేయమని నాకిచ్చింది. నా కొచ్చిన ఆ నాలుగు రూపాయలు నాకు నాలుగు వందల్లా అనిపించాయి. వణుకుతున్న చేతులతో సంతకం చేశాను. రిసీవ్డ్ ఫోర్ హండ్రడ్ అని రాసాను, పోస్టుమేన్ రుసరుసలాడుతూ అది కొట్టేసి మళ్లీ రిసీవ్డ్ ఫోర్ రూపీస్ అని రాయించాడు. అదే నా మొదటి కష్టార్జితం. నాకెంతో ఆనందం వేసింది. ఈ విషయం గుర్తొస్తే ఇప్పటికీ నవ్వొస్తూ ఉంటుంది. అదో మరపురాని థ్రిల్. ఆ తర్వాత అప్పుడప్పుడు ఆంధ్రజ్యోతి నుండి నాకు పడిన కార్టూన్లకు రెమ్యూనిరేషన్ వస్తూ వుండేది. పత్రికల నుండి కార్టూన్లలకు రెమ్యూనిరేషన్ వచ్చేది. కొన్నాళ్లకు ఆంధ్రజ్యోతి వీక్లీలో వుమన్ ఆఫ్ మూడ్స్ ఫుల్ పేజీ (నా మొట్టమొదటి ఫుల్‌పేజీ) కార్టూన్ వచ్చింది. ఇలా కొన్నాళ్లు గడిచాయి. నా కార్టూన్లు కొద్దికొద్దిగా పత్రికల్లో వచ్చేవి తప్పితే పెద్దగా వచ్చేవి కాదు. నా కార్టూన్లలో లోపం ఏమిటో తెలిసేది కాదు. ఒకరోజు నాకో ఆలోచన వచ్చింది.

తెలుగు పత్రికలు - సంపాదకులు

పుస్తకాలు, పత్రికలు లేని ప్రపంచాన్ని నేడు ఊహించుకోలేం. ఈ ప్రపంచంలో పుస్తకం ఓ అద్భుతం. ఎందరెందరో భాషాభిమానం, దేశాభిమానం, సమాజశ్రేయస్సు, ఉద్యమస్ఫూర్తితో పత్రికలు స్థాపించి పాఠకులకు అందుబాటులోకి తెస్తున్నారు. లెక్కకు మిక్కిలిగా వెలువడుతున్న పత్రికలలో చిరకాలం నడిచేవి-పాఠకాభిమానం పొందేవి కొన్నే. పత్రికలను పాఠకాభిమానం పొందేలా సారథ్యం వహించేవాడు సంపాదకుడు. అలాంటి సంపాదకులను 64కళలు.కామ్‌లో నెల-నెలా పరిచయం చేసే శీర్షికే తెలుగుపత్రికలు-సంపాదకులు.



కొల్లూరి

సాహిత్య అభిరుచి కలిగి వుండడం సంతోషించదగ్గదే! అభిరుచి అభిమానంగా మారితే ఏదో తపన ! ఆ తపనతోనే సమాజాన్ని ఎక్స్‌రే తీసి చూపించాలనే మథన. ఆ మథన రూపం తీసుకుంటే అదే రచన. ఆ రచనతోనే తృప్తి పడకుండా మరింతగా రచననీ, రచయితల్నీ ప్రోత్సహించాలనే గ్రథన 'ఎక్స్‌రే' పత్రిక. పత్రికను నడుపుతూ ఉత్తమ సాహిత్య సృజన కోసం పోటీ!

ఏదో తపన, మథన, రచన, గ్రథన, సృజనల సమ్మేళనల రూపం... మూర్తీభవించిన సాహితీ చైతన్యం - అదే కొల్లూరి! 'ఎక్స్‌రే' కొల్లూరి!!

● *ఎక్స్‌రే సాహిత్యమాసపత్రిక ఎప్పుడు స్థాపించారు? 'ఎక్స్‌రే' పేరునే ఎందుకు ఎంచుకున్నారు?*

1981 నవంబర్ నెల 'ఎక్స్‌రే' తొలి సంచిక నా సంపాదకత్వంలో వెలువడింది. తొలి నాళ్ళలో ఎక్స్‌రే పత్రిక వెల 25 పైసలు.

ఎక్స్‌కిరణాలు మానవశరీరంలోని అంతర్భాగాల రుగ్మతల్ని బహిర్గతపరుస్తాయి.

అలాగే సమాజంలో అంతర్లీనంగా వున్న రుగ్మతల్ని బహిర్గత పరచే రచనలకు వేదికగా నిలవాలనే ఆకాంక్షతో ఎక్స్‌రే పేరును పెట్టడం జరిగింది. అంతేకాక నేను రాసిన మినీకవిత...

లక్షల గుండెల్లో రగిలే మంటల్ని
ఎక్స్‌రే తీసి
హృదయండార్క్ రూములో డవలప్ చేసి
ఈ సమాజం ఆల్బమ్‌లో
అంటించేవాడు కవి.

ఈ కవితలో నేటి కవికి వుండవలసిన లక్షణాల్నీ, లక్ష్యాన్ని సూచించాను. ఈ మినీకవితలో పేర్కొన్నట్టు ఎక్స్‌రే పత్రికకూడా ఆ దిశలో సాగాలనే ఆకాంక్ష కూడా మరో కారణం.

● *స్థాపన ముఖ్యోద్దేశం? ప్రేరణగానీ స్ఫూర్తిగానీ ఏమైనా వుందా?*



ఎక్స్‌రే మొదటి సంచిక

ఎక్స్‌రే నేటి సంచిక



ముఖ్య అతిథి శ్రీ నగ్నముని తో



ముఖ్య అతిథి శ్రీ శివారెడ్డి తో



ముఖ్య అతిథి
శ్రీ చేకూరి రామారావు తో

1970–80 దశాబ్దాలు రాజకీయ, సామాజిక, సాహిత్యోద్యమంతో సాగిన కాలం. కవులందరూ ప్రజాఉద్యమాలను సమర్ధిస్తూ ప్రత్యక్ష కార్యాచరణ దిశగా సాగుతున్న కాలం. అప్పటికే రచయితల సంఘాలు, వాటికి అనుబంధంగా పత్రికలు విరివిగా వచ్చాయి. వ్యాపార పత్రికల్లో ప్రభుత్వ వ్యతిరేక రచనలకి చోటు లభించని పరిస్థితులు. ప్రగతిశీల దృక్పధంతో వస్తున్న పత్రికలు, అప్పటి సాహిత్య ఉద్యమోద్రితికి, యువకవుల రచనా వెల్లువకి సరిపోలేదు. పైగా కొత్త కలాలకి, గళాలకి, అవకాశాలు మృగ్యం. కొత్తతరాన్ని ప్రోత్సహించాలనే ముఖ్యోద్దేశ్యంతోనే పత్రికను స్థాపించాను. ఇక ప్రేరణ, స్ఫూర్తి అనేవి ఆనాటి పరిస్థితులే కల్పించాయి.

- *పత్రికా ప్రచురణలో- పంపిణీలో సాధక బాధకాలు?*

ప్రచురణారంగంలో వచ్చిన ఆధునిక సదుపాయాలు అందుబాటులోకిరాని ప్రాంతం, తూర్పు గోదావరిజిల్లా అమలాపురంనుండి పత్రికను ప్రచురించడం ఒక సాహసప్రక్రియ. లెటర్ ప్రింటింగ్ ప్రెస్‌లో తొలి దశాబ్దం ఎక్స్‌రే ప్రచురించబడింది. పత్రికను ప్రమోట్ చేసుకోవడానికిగాని, పంపిణీకిగానీ ఏమాత్రం అనువైన ప్రాంతం కాదు. అయినా ఆ దశాబ్దకాలం ఎక్స్‌రేకి స్వర్ణయుగం. ఒకరినుండి మరొకరు ఎక్స్‌రేని గురించి తెలుసుకుని చందాదారులుగా చేరి ఎక్స్‌రేని ప్రోత్సహించారు. ఎన్నో బాలారిష్టాలను తట్టుకుని నేడు ఎక్స్‌రే మూడవదశాబ్దాన్ని పూర్తిచేసుకోబోతోంది.

- *తెలుగు కవిత్వంలో ఎక్స్‌రే పాత్ర?*

ఆధునిక తెలుగు సాహిత్యంలో ఎక్స్‌రే పాత్ర చాలా స్పష్టమైనది. నేడు ప్రముఖ కవులుగా గుర్తింపుపొందినవారు, ఎక్స్‌రే ద్వారా ఎదిగినవాళ్ళమని చెప్పుకోవడం తెలుగుకవిత్వంలో ఎక్స్‌రే పాత్రను, విశిష్టతని తెలుపుతుంది. మినీ కవితకు వేదికగా నిలిచి ఎందరో యువకవుల్ని ప్రోత్సహిస్తూ, వారిని సాహిత్య మార్గం పట్టించిన ఘనత ఎక్స్‌రేది. ఎప్పటికప్పుడు కొత్త కవుల తప్పటడుగుల్ని సరిచేస్తూ, వారితో నిరంతరం ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిస్తూ, అధ్యయనం పట్ల వారికి ఆసక్తిని కలగచేస్తూ ఒక ఉద్యమ స్ఫూర్తితో ఆధునిక తెలుగు కవిత్వంలో ఎక్స్‌రే తన పాత్రని నిర్వహించింది, నిర్వహిస్తోంది. 1983 నుండి ప్రతీ సంవత్సరం ఉత్తమ కవితకు అవార్డు ప్రారంభించి, కొనసాగిస్తూ వుంది. తొలి నాళ్ళలో 300/.నగదు, జ్ఞాపిక, సత్కారంతో ప్రారంభించి, నేడు 5000/.నగదు అందిస్తోంది.నేడు తెలుగు సాహిత్య రంగంలో అందిస్తున్న పురస్కారాలలో ఎక్స్‌రే పురస్కారం అందుకోవడం కవులు ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు. ఒక ప్రధాన అవార్డుతోపాటు మరో పది ఉత్తమ కవితల్ని ఎంపిక చేసి ఆ కవులకు జ్ఞాపికతో సత్కారం కూడా అందిస్తూ కవుల్ని ప్రోత్సహిస్తోంది.

- *ఎక్స్‌రే పై ప్రముఖుల స్పందన?*

మహాకవి శ్రీశ్రీ, "కవిత్వం కోసమే పత్రకను వెలవరించడం అభనందనీయం" అంటూ ప్రశంసించి పత్రిక చందాదారునిగా చేరటం, "ఈ నాటి కవిత కోసం మీరు ప్రత్యేకించి శ్రద్ద వహించి,



అవార్డు అందుకున్న కవులతో శ్రీ అద్దేపల్లి, శ్రీ జ్వాలాముఖి తదితరులు

వ్యయ ప్రయాసలను భరిస్తున్నారు. మీ పద్ధతిలో మీ కృషి సాగుతోంది అభినందనలు" అంటూ ప్రముఖ దిగంబరకవి నిఖిలేశ్వర్, "మీ నిరంతర ఉద్యమావేశానికి గుర్తుగా వుంది ఎక్స్‌రే" అంటూ ప్రముఖ దిగంబర కవి జ్వాలాముఖి, "వ్యయప్రయాసలకు లెక్కచేయక, నిర్బంధాలకు తలవంచక ఎక్స్‌రేని వెలువరిస్తున్న మీ కార్యదీక్షకు అభినందనలు" అంటూ దాశరథి "కొత్త రచయితలను ప్రోత్సహిస్తూ, యువ రచయితలను తీర్చి దిద్దడంలో ఎక్స్‌రే నెం. 1" అంటూ నాగభైరవ కోటేశ్వరరావు. ఎక్స్‌రే విప్లవానికి బలియసావధానంగా స్థిరపడిపోయింది అంటూ శేషేంద్రశర్మ, కవిత్వోద్యమ దుమారాన్ని లేపుతున్నారు అంటూ డా॥ ఎన్. గోపి, ఇంకా ఆరుద్ర, ఇస్మాయిల్, డా॥ కె. శివారెడ్డి, చెరబండరాజు, నగ్నముని, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, డా॥అద్దేపల్లి ఎందరో ప్రముఖ కవుల అభినందనలు అందుకుంది ఎక్స్‌రే. అంతేకాక ఎక్స్‌రే చేసిన ఎన్నో ప్రయోగాలు ప్రముఖుల ప్రశంసలు పొందాయి. కావ్యసమీక్షతోనే వెలవరించిన సంచిక, దీర్ఘ కవితతో వెలువరించిన సంచిక, స్త్రీవాద కవిత్వంతో ప్రత్యేక సంచిక, ఫ్లాష్ బ్యాక్ శీర్షికన, ప్రముఖ కవుల ముఖచిత్రాలలో వారి పరిచయాలు కవితతో వచ్చిన సంచికలు, ప్రప్రథమంగా అతిథి సంపాదక సంప్రదాయం, చెరబండరాజు సంస్మరణ సంచిక, కృష్ణశాస్త్రి కవితా వైభవం, కుందుర్తి ప్రత్యేక సంచిక, సి.నా.రె. ప్రత్యేక సంచిక, శ్రీశ్రీ ప్రత్యేక సంచికలు అందరి ప్రశంసలు అందుకున్నాయి. అంతేకాక ఎక్స్‌రే ప్రచురణలు పేరిట రెండువందల మంది కవుల మినీకవితలతో 'మినీకవితా సంపుటి వంటివి ప్రచురించడం ప్రసంశలు పొందటం జరిగింది.

● *ప్రచురణా రంగంలో వచ్చిన టెక్నాలజీని ఏవిధంగా వాడుకుంటున్నారు?*

తొలిదశాబ్దకాలం అమలాపురంనుండి లెటర్‌ప్రెస్ ముద్రణా పద్ధతుల్లో ప్రచురించిన ఎక్స్‌రే, ఆ తరువాత కొంతకాలం మద్రాసునుండి, అటుపై విజయవాడలకు మారటం వలన ప్రచురణారంగంలో వచ్చిన డెస్క్‌టాప్ పబ్లిషింగ్ పద్ధతుల్ని వినియోగించుకుంటూ సర్వాంగసుందరంగా, కలర్‌టైటిల్‌తో వెలువడుతోంది. ప్రచురణ వ్యయభారం పెరిగినా ఆధునీకత వల్ల సౌలభ్యం పెరిగింది.

● *ఎంతోమంది కవులకు స్ఫూర్తినిచ్చిన ఎక్స్‌రే మాసపత్రిక రెగ్యులర్‌గా రాకపోవడానికి గలకారణాలు?*



ఎక్స్‌రే వ్యాపార పత్రిక కాదు, కేవలం కవిత్వంకోసమే వెలువడుతున్న పత్రిక, సంవత్సర చందా 3/రూ॥ నుండి ముప్పై సంవత్సరాలకి 75/- రూ॥లకు పెరిగింది. కేవలం చందాదారులకే పరిమితం. ఆ చందాదారులూ పరిమితమే. కవులు కాంప్లీమెంటరీ కాపీని ఆశిస్తారు కానీ చందాదారులుగా చేరటం వారి ప్రతిష్ఠతకి భంగంగా భావిస్తారు. కాపీల సంఖ్య పరిమితం, ఖర్చు అధికం, ఈ సమస్య ఎక్స్‌రేదే కాదు చాలా పత్రికల్ని వేధిస్తున్న సమస్య ఇదే. ఏనాడు ఎక్స్‌రేని లాభాపేక్షతో చూడటం లేదు. వీటితోపాటు అలసత్వం, సమయభారం ఇదే ప్రధాన కారణం. ఒకప్పుడు ఎన్నో పత్రికలకి నాంది పలికింది ఎక్స్‌రే.

వరంగల్ నుండి 'ప్రసారిక' అనకాపల్లి నుండి 'కెరటం', 'అద్దం' ఖర్గపూర్ నుండి 'జిల్గు' మచిలీపట్నంనుండి 'ప్రమిద', గుడ్‌మార్నింగ్' కాకినాడ నుండి 'శిలాస్వరాలు', రాజమండ్రి నుండి 'విపంచి' ఇంకా పలు ప్రాంతాలనుండి 'తోరణం', 'వెల్లువ', 'వెలుగు', నవత' 'దివిటి' అమలాపురం నుండి 'తొలిపొద్దు' ఇలా ఎన్నో పత్రికలు ఆ రోజుల్లో రావడానికి ఎక్స్‌రే ప్రేరణ కల్పించింది. నేటికీ వీటిలో కొన్ని పత్రికలు కొనసాగుతున్నాయి. కొన్ని ఆగిపోయాయి. ఇంతటి చరిత్రను సృష్టించుకున్న ఎక్స్‌రేని మళ్లీ ప్రారంభంనాటి ఉద్యమస్ఫూర్తితో తీసుకురావడానికి కార్యాచరణదిశగా కదులుతున్నాను.

ఆంధ్ర శిల్పులు

- ద్వివేదుల సోమనాథ శాస్త్రి

చిత్రకళతోపాటు శిల్పకళ కూడా బహుప్రాచీనమయినది. శిల్పకళముందా? చిత్రకళముందా? అని ప్రశ్నించుకుంటే విత్తు ముందా? చెట్టుముందా? అన్నట్టు వుంటుంది. అంచేత రెండూ ఒకేసారి ఉద్భవించాయి అనుకోవడం మేలు. ఒక వృక్షానికి చెందిన రెండు శాఖలు, కొందరు శిల్పులూ, కొందరు చిత్రకారులూ అయ్యారు అంతే.

ప్రథమంగా చిత్రకారులూ, శిల్పులూ ఒకే ప్రాంతంలో స్థిరంగా వుండేవారు కాదు. ఎందుకంటే జీవన భ్రుతికోసం సంచారం చేస్తూ ఏ ప్రాంతంలో తమ కళకు ఆశ్రమం దొరికితే ఆ ప్రాంతంలో ఆయా ప్రభువుల ప్రాపకంలో జీవించేవారు. అక్కడ అందరితో కలిసి పని చేసేవారు. అలాగే ఆంధ్రులు కూడా .



అయితే ఎక్కడ పనిచేసినా వారి వారి రూప, ఆచార, అలంకరణా సాంప్రదాయాలను తమ, చిత్రాల, శిల్పాలలో ప్రతిబింపచేసేవారు. అందువల్ల వారు ఏప్రాంతాల (రాష్ట్రాల) వారో నిశింతంగా పరిశీలిస్తే తెలిసేది.

శాతవాహనులు క్రీస్తు పూర్వం 1,2, శతాబ్దాలలో దేశాన్ని పరిపాలించేవారు. వారు ఆంధ్రదేశాన్నే కాక దేశంలో యితర ప్రాంతాలను కూడా పాలించారు. అప్పటిలో - రాష్ట్ర సరిహద్దులు వేరుగా వుండేవి ఆంధ్రప్రాంతాలు కొన్ని, మహారాష్ట్రలోనూ, తమిళ రాష్ట్రంలోనూ కన్నడ రాష్ట్రం, ఒరిస్సా, మొదలయిన రాష్ట్రాల్లో కలిసి వుండేవి. అలాగే ఆయా రాష్ట్రాల ప్రాంతాలు ఆంధ్రాలోనూ కలిసి వుండేవి. అందువల్ల కళాకారులకు ఈ విభజన వుండేది కాదు.

ఈ కారణంగానే అజంతాలో మొదటి గుహలు ఆంధ్రశిల్పుల సృష్టి అని తెలుస్తుంది. అలాగే సాంచీ ప్రాకారం కూడా ఆంధ్రుల నిర్మాణమే అవి ఆంధ్ర శిల్పుల ప్రతిభకు నిదర్శనం.

ఇక్ష్వాకుల కాలంలో నాగార్జున కొండ వెలిసినపుడు ఆ కొండ మీద బుద్ధుని జాతక కథలన్నింటినీ తెలుగు శిల్పులే మలచారు.

తర్వాత ప్రపంచ ప్రఖ్యాతి చెందిన అమరావతి శిల్పాలు యివి ఎక్కువగా గ్రీకు, గాంధార శైలికి దగ్గరగా వుంటాయి. యివి ఆంధ్ర శిల్పకళకు పెట్టింది



పేరు.

కళింగ రాజుల కాలంలో దేవాలయ శిల్పం చాలా అభివృద్ధి చెందింది. కళింగ రాజులు ఆంధ్ర దేశాన్ని పరిపాలించిన కాలంలో ఆంధ్ర శిల్పులు ఒరిస్సాలోని కోణార్క దేవాలయంలో అమోఘమయిన శిల్ప సృష్టి చేశారు. ఆ శిల్పాలను మలచిన విధానం, వాటి అందచందాలు సౌందర్య రూపాలు చూసి ముగ్ధులు కానివారుండరు.

పల్నాడులోని గోలి శిల్పాలు, సింహాచలంలోని నల్లరాతి శిల్పాలు అద్భుతమయినవి. యీ కళాఖండాలలో కొన్నింటిని విదేశాలకు తరలించబడినాయి.

ఇలా పురాణ, చరిత్రాత్మక, శిల్పాలు ఎన్నో మనకు కనువిందు చేస్తాయి. కాని ఒక వ్యక్తిని గాని, ఒక రాజుని గాని, వాస్తవికంగా చిత్రించే శిల్పాలుగాని, శిల్పులుగాని కానరారు వున్నా చాలా అరుదు.

చిత్రలేఖనంలో వచ్చిన మార్పుల లాగే ఆయా ప్రభువుల పాలనలో శిల్పకళలోనూ మార్పులు వచ్చాయి. మూర్తి చిత్రాలు రావడం ప్రారంభయింది. కొంతమంది చిత్రకారులు రేఖా చిత్రాలుగా చిత్రించారు.

బ్రిటిష్ వారి రాకతో యీ మూర్తి శిల్పకళ వృద్ధి పొందింది. ముందుగా కొంతమంది ముస్లింలు గుంటూరు ప్రాంతంలో మూర్తి శిల్పాలను చెక్కారు.



తమ కల్పనా మేధస్సుతో అపురూపమయిన శిల్పాలను, ఆధునిక శైలులలో వివిధ ప్రక్రియలలో, రీతులలో సృష్టించి, ఖ్యాతిని ఆర్జిస్తున్నారు. వీరి శిల్పాలు కొన్ని బీచ్‌రోడ్‌లో కనువిందుచేస్తున్నాయి.

బరోడా విశ్వవిద్యాలయం నుండి జి.రవీంద్ర రెడ్డి, గుంటూరు నుండి డి.సాంబశివరావు, పెండెం రఘు, ప్రకాశం జిల్లా నుండి సి.హెచ్. భరద్వాజ శాస్త్రి, తూర్పుగోదావరి జిల్లా నుండి వి.శశిరావాడ కృష్ణ, తాడేపల్లిగూడెం నుండి తాడేపల్లి వెంకన్న,– జయపూర్ (ఒరిస్సా) నుండి డి.లక్ష్మీనారాయణ, శ్రీకాకుళం నుండి పి.వీరభద్రరావు, శ్రీ కూర్మం నుండి దివిలి అప్పారావు

గణపలి స్థపలి వారి శిక్షణలో ఎ.ఎస్ ప్రసాద్, దేవు

తర్వాత తర్వాత యితర ప్రాంతాలలో ప్రాచుర్యం పొందింది. చాలా మంది, ప్రభువులు, రాజులు, జమీందారులు తమ తమ శిల్పాలను తమ పూర్వీకుల శిల్పాలను గుర్తుగా పెట్టుకోవడం, ఒక ప్రతిష్టగా మారింది.

అలాంటి శిల్పులు ఆంధ్రదేశంలో ఎంతోమంది వుండేవారు వారు ఎన్నో అపురూపమయిన శిల్పాలను తయారు చేశారు. కాని దురదృష్టం ఏమిటో గాని ఆ శిల్పాలు క్రిందగాని, శిలా ఫలకాలలో గాని ఆ శిల్పుల పేర్లు వుండవు. ఆ శిల్పం ఎవరిదో వారి పేరు, ఆ శిల్పాన్ని ఆవిష్కరించిన మంత్రివర్యుల పేర్లు, తేదీ, వివరాలు వుంటాయి గాని, శిల్పిపేరు వివరాలు సాధారణంగా కనబడవు. అలా ఎంతోమంది శిల్పులు తెలియకుండా పోయారు.

శాంతినికేతనంలో శిక్షణ పొందిన – చిత్రవీరభద్రరావు, డి.శీనాథ రత్నశిల్పి వుడయార్ మద్రాసు కళాశాల రామ్‌చౌదరీ గారి శిక్షణలో–అంట్యాకుల పైడిరాజు, కె.ఎల్.ధర్, సి.యస్.ఎన్. పట్నాయక్, కె.విశ్వనాధం, సత్య బసవాచారి, అంబా రాధాకృష్ణ, వై.వెంకట లక్ష్మయ్య వున్నారు.

విశాఖపట్నంలో నేమాని కృష్ణమూర్తి, ఏ.రాజన్, ఎమ్.పేరయ్య ఆంధ్రాయూనివర్శిటీ ఫైన్ ఆర్ట్స్ విభాగం నుండి వచ్చిన హరిప్రసాద్, పి. శ్రీనివాస్, రమణమూర్తి, స్వర్ణలత మహాపాత్ర మొదలయిన శిల్పులు తమ

శంకర్ గారు విజయనగరం అంట్యాకుల పైడిరాజుగారు, ప్రసిద్ధ శిల్పులు వీరు తయారుచేసిన "గురజాడ అప్పారావు" గారి విగ్రహం చాలా ప్రఖ్యాతి గాంచినది. ఇది విశాఖపట్నం ఆర్.టి.సి కాంప్లెక్స్ కూడలిలో వుంది. వీరి చేతిలో రూపు దిద్దిన అల్లూరి సీతారామరాజు, నెహ్రూ, పి.ఎల్.ఎన్.రాజు బొద్దు పై వున్న విగ్రహాలు, గరివిడిలోనూ, రామతీర్ధాలులోనూ వున్న విగ్రహాలు ముఖ్యమయినవి. వీరి శిష్యులలో ఎన్.సత్యనారాయణశర్మ, ధర్మారావు గార్లు మంచి పేర్లు తెచ్చుకున్నారు.

విజయనగరం నుండే "శిల్పాచారి" గారు ఎన్నో శిల్పాలను తయారు చేశారు. వీరు తయారు చేసిన "ఆదిభట్ల నారాయణ దాసుగారి విగ్రహరి ఎంతో ప్రఖ్యాతి వహించింది.

ఇలా ఎంతో మంది శిల్పకారులు వున్నారు. కొంతమందివి నాకు తెలియక పేర్కొన లేనందుకు మన్నించాలి. పేర్కొన్న వారి గురించి, శిల్పాల వివరాల గురించి విపులంగా వ్రాయడానికి స్థలాభావం వల్ల వీలుపడలేదు.

ఈ శిల్పకారులందరూ తమదైన పద్ధతిలో కళాసేవ చేస్తున్నవారు వీరు యింకా అభివృద్దిలోకి రావాలని, దేశంలో మన ఆంధ్రశిల్పుల గొప్పతనాన్ని ఇనుమడింపచేయగలరని ఆశిస్తున్నాను.



-పద్మకళ

దీపావళి

వెలుగు జ్ఞానానికి సంకేతం. అజ్ఞానాంధకారాన్ని పారద్రోలే వెలుగుల పండుగ దీపావళి. శోభాయమానంగా వెలిగే దీపాలతో ముంగిళ్ళను తీర్చిదిద్ది గృహాలను దీపకాంతులతో అలంకరించి మహాలక్ష్మికి స్వాగతం పలికే పండుగ దివ్వెల పండుగ.

ప్రపంచానికే ఇది ఒక మహా సందేశం:

శిష్టజన రక్షణ కోసం దుష్టుడైన కొడుకును అంతమొందించిన ఓ తల్లి పరాక్రమ గాథ ఇది. వరానుగ్రహ మదంతో విర్రవీగిన నరకాసురుణ్ణి నేల కూల్చి, రాక్షసత్వాన్ని అంతమొందించిన పండుగ దీపావళి. అమ్మ ప్రేమ తన ఆగడాలకు అడ్డుకట్ట వెయ్యదనుకున్న నరకుడి ఆలోచన భంగపాటుకు గురైంది. నానా కష్టాలూ పడి తపస్సు చేసి, భగవత్ సాక్షాత్కారం పొందాడు నరకుడు. దర్శనమిచ్చి తనను అనుగ్రహించిన దైవాన్ని కోరిన వరంలోనే అతని మూర్ఖత్వం వ్యక్తమవుతుంది. తన దుష్టత్వం శాశ్వతం కావాలనుకున్నాడు. తనకు ఎవరూ ఎదురు నిలవకూడదనుకున్నాడు. తనలోని చెడును రోజురోజుకీ పెంచి పోషించుకున్నాడు. ప్రపంచానికి చేటు చేసే కొడుకును ఏ తల్లి క్షమించలేదని ఆఖరుకి తెలుసుకున్నాడు.



భరతఖండంపై కొన్ని యుగాల కొద్దీ కాలం నుండీ ఎందరో యోగి పుంగవులు, మహానుభావులు ఘోర తపస్సులాచరించి, వారి తపశ్శక్తిని లోక సంక్షేమార్థం ధార పోస్తుండగా, నరకుడు తన తపశ్శక్తిని లోక నాశనానికి వినియోగించాలని ప్రయత్నించాడు. ఫలితంగా అతను తీసుకున్న గోతిలో తానే పడ్డాడు.

మనసు పొరల్లో ముసురుకున్న రాగ ద్వేషాల్ని, ఈర్ష్యాసూయల్ని స్వచ్ఛమైన నూనెలో ముంచిన తెల్లని వస్త్రాన్ని, ప్రకృతి ప్రసాదించిన గోగుకాడలకి చుట్టి నేలకేసి బాది వదిలించుకునే ఆచారం మనది.

దిబ్బూ దిబ్బూ దీపావళి

మళ్ళీవచ్చే నాగులచవితి

అంటూ దీపావళీ నాటి సాయంత్రం పిల్లా, పెద్దా గుమ్మంలో దీపావళి దివిటీలు వెలిగించి, ఈనాటి వెలుగులు ఏడాది మొత్తం ఉండాలనీ, దీపావళి నుండి నాగులచవితి దాకా, నాగులచవితి నుండి మళ్ళీ దీపావళీ దాకా ఆ కాంతులతో తమ నివాసాలు స్వర్గ ధామాలు కావాలనీ కాంక్షించటం ఇందులోని ఆంతర్యం.

బిడ్డను క్రమశిక్షణతో పెంచవలసిన అవసరాన్ని, హద్దు మీరినపుడు మాతృ ప్రేమనైనా పక్కన పెట్టి బుద్ధి చెప్పవలసిన అవసరాన్ని దీపావళి ప్రతి తల్లికీ గుర్తు చేస్తుంది.

స్త్రీ శక్తిని నిరూపించిన సత్యభామ పరాక్రమ కథ ఇది. స్త్రీ అబల కాదనీ మహాబల అనీ నిరూపించేందుకు ద్వాపర యుగంలో శ్రీకృష్ణ పరమాత్మ ఆమెను యుద్ధానికి ప్రోత్సహిస్తాడు. జగన్నాటక సూత్రధారి స్నృహను కోల్పోయి తన భామలో రౌద్రాన్ని రగిలిస్తాడు.



తత్ఫలితమే నరకాసుర నిర్మూలనం.

దీపాలను వెలిగించడానికి ఓ ప్రత్యేక కారణమూ ఉందని పెద్దలు చెబుతారు. దుష్టుడైన నరకుడి కంటపడకుండా ఉండేందుకే ఆ రోజుల్లో ప్రజలు దీపాలను సైతం వెలిగించకుండా చీకట్లో మగ్గిపోయే వారనీ, స్త్రీలని అలా కాపాడుకునే వారనీ నరకవధానంతరం ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ లోగిళ్లను వెలుగులతో నింపి పండుగ చేసుకున్నారనీ అంటారు.

దీపాల అంతరార్థం:

నూరేళ్ళ మనిషి జీవితంలో సగ భాగం సూర్యుని వెలుగు కానలేక చీకట్లో గడిపితే మిగిలిన సగభాగంలో కూడా చాలా మేర అంతరంగాల్లో అలుముకున్న అంధకారం మనల్ని పెడత్రోవ పట్టిస్తుంది. మన పరిసరాలను దీపాల వెలుగులతో అలంకరించినట్లుగానే మన అంతరాలయమైన హృదయాలయాన్ని కూడా విశాల దృక్పథమనే కాంతితో నింపుకోవాలి. వెలుగుతున్న దీపమే ఇతర దీపాలని వెలిగించినట్లు మంచిని ఆచరించిననాడే ఇతరులకు చెప్పే అర్హత మనకి లభిస్తుందని మనం గ్రహించాలి. ఆశ అనే చిరుదీపం వెలిగించి, కొండంత వెలుగును సాధించి మనలోని నిరాశా చీకట్లని అంతం చేసుకోవాలి.

దీపావళి పండుగనాడు ఇల్లంతా దీపాలతో అలంకరించి, బాణాసంచా కాల్చుకొన్నంత మాత్రాన సరిపోదు. మనోదీపాన్ని మరింత తేజోవంతంచేసుకోవాలి. ఈ సకల చరాచర జగత్తులో మన స్థానం ఏమిటి? అని నిత్యమూ మనల్ని మనం ప్రశ్నించుకోగలగాలి. మనల్ని మనం అనుక్షణం సంస్కరించుకోవాలి. అదే పండుగల అర్థమూ, పరమార్థమూనూ...

జాతక సమస్యలకు పరిష్కారం

ప్రముఖ జ్యోతిష్యులు **శ్రీ ఏ.వి. మోహనగుప్తగారు** పాఠకుల జాతక సమస్యలకు ఇ-మెయిల్ ద్వారా (మీ జాతక చక్రంతోపాటు) సమాధానాలిస్తారు.

పాఠకులు మీ సమస్యతో పాటు క్రింది వివరాలు మెయిల్ చేయాలి.

సమస్య ....

పుట్టినతేది .... సమయం.................... స్త్రీ/పు..........

పుట్టిన ఊరు.................... జిల్లా.................... రాష్ట్రం..........

మీపేరు ....

మీ ఇమెయిల్ ....

మీ వివరాలు పంపాల్సిన email: usalapati@yahoo.com

జవాబు కొరకు వారం రోజులు వ్యవధి పడుతుంది.

- మాకినీడి సూర్యభాస్కర్

మధుర గాయకుడు - ఘంటసాల

పండిత పామర జన రంజన గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు. 'పాడుతా తీయగా చల్లగా' అంటూ మన నోట పాడించాడు. 'పదిమందిలో పాటపాడిన అది అంకితమెవరికో ఒకరికే' అని పాట వరసకి అన్నా, నిజానికి ఆయన పాట అఖిలాంధ్ర జనులకూ అంకితం.

గుండెలనే కాదు, బండలను సైతం కరిగించగల గాన మాధుర్యం - శివానందలహరి... శివశంకరి' అని గమక బేధాలతో పాడితే చెవుల్లో తుప్పువదిలిపోతుంది. 'ఏపూర్వ పుణ్యమో ..అపురూపమై నిలచే నా అంతరంగానా' అని ప్రతి తెలుగు శ్రోత ఘంటసాల గురించి ఒక్కమారైనా అనుకోదంటే అతిశయోక్తి కాదు.

అక్కినేనికి, నందమూరికీ ఘంటసాల ఎక్కువగా పాడారు. 'రాగమయీ, అనురాగమయీ రావే' అన్నా, 'కలకానిదీ, విలువైనదీ - బ్రతుకూ కన్నీటి ధారలలోనే బలిచేయకు అని నిరాశను ధ్వనించినా, 'మనసుగతి ఇంతే... మనిషి బ్రతుకింతే' నని వైరాగ్యాన్ని పలికించినా, ఘనాఘన సుందరుణ్ణి భక్తి భావంతో కొలిచినా అచ్చం నాగేశ్వరరావే పాడుతున్నట్లుంటుంది. 'నన్ను దోచుకొందువటే వన్నెల దొరసానీ' అని శృంగారం ఒలికించినా, 'పిలచిన పలుకవు ఓ జవరాలా' ప్రియురాలినే జర రమ్మని అడిగినా 'లేచింది నిద్రలేచింది మహిళా లోకం దద్దరిల్లింది పురుష ప్రపంచం' అని స్త్రీని చైతన్య పరచినా రామారావే స్వతహాగా గళమెత్తాడనిపించేలా మనల్ని అశ్చర్యపరిచారు ఘంటసాల.

భూకైలాస్ చిత్రంలో రావణుడి పాత్రవేసిన రామారావుకు, నారదుడు పాత్ర వేసిన నాగేశ్వరరావుకు ఒకే పాటలో స్వరభేదాన్ని సమ్మోహనకరంగా వినిపించారు ఘంటసాల.

"దేవదేవ ధవళాచల గంగాధరాహర నమోనమో దైవత లోకసుధాంబుదిహిమకర

లోక శుభంకర నమో నమో" అని పాడుతుంటే ఆ స్వరంలో రామారావు గళ గాంభీర్యం, అందునా పురాణ





పాత్రలలో ప్రత్యేకించి సంలీనమై వినిపిస్తుంది. అంతలోనే

"నారాయణ హరి నమో నమో

నారద హృదయ విహారీ నమో నమో...

పంకజ నయనా - పన్నగ శయనా

నారాయణ హరి నమో నమో"అని పాడుతుంటే కాస్తంత పేలవమైన నాగేశ్వరరావు గొంతుకు సరిగ్గా అతికినట్లే అనిపిస్తుంది.

అగ్ర నటులిద్దరినీ తన 'స్వరచాలనం'తో తెలుగు శ్రోతల హృదయాల్లో తిష్ఠవేయించారు. ఘంటసాల.

అలముకొన్న చీకటిలోనే అలమటించనేల

కలతలకే లొంగిపోయీ కలవరించనేల

సాహసమను జ్యోతిని చేకొని సాగిపో'' అని సందేశాన్నిచ్చినా,

"తప్పదులే... ఏనాటికైనా తప్పదులే...' అని సందేహాన్ని వ్యక్త పరచినా,

"గాంధీపుట్టిన దేశమా ఇది - నెహ్రూ కోరిన సంఘమా?

సామ్యవాదం రామరాజ్యం - సంభవించే కాలమా"! అని అభ్యుదయాన్ని పలికించినా

తెలుగు వీర లేవరా- దీక్షబూని సాగరా

దేశమాత స్వేచ్ఛకోరి - తిరుగుబాటు చేయరా" అని విప్లవించినా...

అన్ని భావాలను సమాన దక్షతతో పలికించి శ్రోతలను మంత్రముగ్ధుల్ని చేశారు ఘంటసాల. నవరసాలూ ఆయన గళంలో నవనవోన్మేషంగా ఊరాయి. వింటుంటే పులకింత కలిగే పాటలుఎన్ననీ! ఈ నల్లని రాళ్ళలో, జగమే మాయ, పయనించే ఓ చిలుకా, బొమ్మను చేసీ...ఆలయాన వెలసినా ఆ దేవుని రీతి... రారా కృష్ణయ్య, తెలుగుజాతి మనది, మరో ప్రపంచం మరో ప్రపంచం మరో ప్రపంచం పిలిచిందీ, జయమ్ము నిశ్చయమ్మురా, ననుపాలింపగా నడచీ వచ్చితివా?ఇలా ఎన్నెన్ని... చెప్పడం అపరిమితం.

దేశభక్తినీ, అభ్యుదయాన్నీ ప్రత్యేకించి అపురూపంగా పలికించారు ఘంటసాల కారణం ఆయన గొప్ప దేశభక్తుడూ, అభ్యుదయవాది కావడం కావచ్చు. స్వయంగా స్వాతంత్ర్య సమరంలో పాల్గొని జైలుకు వెళ్ళారాయన. 1940లో దేశనాయకులందరిరినీ బ్రిటీషు ప్రభుత్వం జైళ్లలో పెట్టింది. 1942లో 'క్విట్ ఇండియా ఉద్యమం వచ్చింది ఆ నేపధ్యంలో దేశ భవితవ్యం కంటే సంగీతమూ, కుటుంబ బాధ్యతలూ అల్పమైనవిగా అనిపించాయి ఘంటసాలకు. ఏదో తెలీని ఆవేశంతో భారత పౌరునిగా కనీస కర్తవ్యమని ఎంచి ఆనాటి ఉద్యమంలో పాల్గొన్నారు ఘంటసాల. ఫలితంగా పద్దెనిమిది నెలలు కారాగార శిక్షను అనుభవించారు. అలీపూర్ సెంట్రల్ జైలులో వున్న కాలంలోనే కార్యదీక్ష, దృఢ సంకల్పం, నియమబద్ధమైన జీవితం తనకు అలవడ్డాయని చెప్పేవారు ఘంటసాల. అయితే జైలు నుండి విడుదలయ్యాక, తన సహజ ధోరణిలో పడిపోయి, సినీ నేపథ్యయకునిగా, సంగీత దర్శకునిగా శ్రోతలను నలరించారు. అది మన అదృష్టం.

ఘంటసాలను మద్రాసు తీసుకెళ్లింది సముద్రాల అయితే మొదట అవకాశమిచ్చింది బి.ఎన్. రెడ్డి. చిత్తూరి నాగయ్యగారి సంగీత సారథ్యంలో 'స్వర్గసీమ' సినిమాకు మొదటగా పాడారు ఘంటసాల. ఆ తర్వాత రేణుకాఫీసులో ఉచిత భోజన, నివాస సదుపాయాలతో ఐదు రూపాయల జీతంతో గాయకునిగా జీవితం ప్రారంభించారు. గూడవల్లి రామబ్రహ్మం గారు ఘంటసాలను బాగా ప్రోత్సహించారు.

గాయకునిగా ఎంత పేరు పొందారో, సంగీత దర్శకునిగా కూడా అంతే పేరు పొందారు ఘంటసాల

గారు. దాదాపుగా వంద చిత్రాలకుపైనే సంగీతం కూర్చారు. పాతాళభైరవి, మాయాబజార్, గుండమ్మకథ మొదలైన చిత్రాల్లోని పాటలు ఎంతో ప్రజాదరణ పొందాయి. సినిమా పాటలతో పాటు, లలిత గీతాలను కూడా పాడారు ఘంటసాల.

అత్తలేని కోడలుత్తమురాలు ఓయమ్మా..


కోడలులేని అత్త గుణవంతురాలు" అని పాడితే గ్రామీణ నెరజాణత్వం జాలు వారుతుంది. పంచదార వంటి పోలీసు వెంకటస్వామిని తానే కాదు ఎవరూ కూడా మరువలేనంతగా కన్నులకు కట్టించారు. కరుణ శ్రీలుప్పొంగగా జంధ్యాల పాపయ్య శాస్త్రి గారి పుష్పవిలాపం, కుంతీ కుమారి కవితా ఖండికలను అజరామరంగా గానం చేసారు ఘంటసాల.

'భారతీయ కళాప్రాభవమ్ము లిఖింప
తీయగా పాడిన కోయిలమ్మా
కమనీయ వంగ వంగడమెల్ల
మూర్తిలో ప్రభవించినట్టి మేల్ పసిడి బొమ్మా!
స్వారాజ్యవీర విహార రంగములో
కోరి దూరిన తెలుగు కోడలమ్మా!" అంటూ సరోజనీదేవి మూర్తిని కళ్లెదుట నిలవటమే కాకుండా, రాసిన జంధ్యాల వారిని చిరంజీవిని చేశారు ఘంటసాల. చిన్ని వలపు గీతాలెన్నో వెలిగించారు. అందరి మనస్సుల్లో అవ్యక్త మధురోహలను కలిగించారు ఘంటసాల.

అపురూప గాయకుడు, నిరుపమాన సంగీత సారధి మాత్రమే కాదు ఘంటసాల, స్వయంగా రచయిత కూడా. మృత్యువంటే భయం లేని ఒక వ్యక్తి పాడుకున్న పాటను రచించి అమృతమయంగా గానం చేశారు.

'బహుదూరపు బాటసారీ- ఇటు రావోయ్ ఒక్కసారి...
పయన మెచటికోయీ- నీ పయన మెచటికోయీ
అర్ధరాత్రి పయన మేలనోయీ- పెను తుఫాను రేగనున్నదోయీ...
వేకువనే పోదువోయ్..."

ఒక్కసారి రమ్మన్న బాటసారి వచ్చాడో లేదో కాని, పాట పూర్తయ్యేసరికి మనం ఘంటసాల గాన మాదురీ మాయాజాలంలోకి వెళ్లిపోతాం. ఏడు కొండలస్వామి ఎక్కడున్నాడో ఎన్ని మెట్లెక్కినా కానరాడెందుకని తెలీని అవ్యక్త భావాన్ని భక్తి పారవశ్యంలో రంగరించి చూపిన నటుడు కూడా ఘంటసాల.


ఘంటసాలతో
బాలు, పి.బి. శ్రీనివాస్

ఎందరో రచయితలు, కవులు రాసిన పాటలను అజరామరంగా పాడి, వారికీ వారి పాటలకీ చిరంతన కీర్తిని తెచ్చారు ఘంటసాల ఆత్రేయ రాసిన పాటలనెన్నో తన తీయనైన గళంలో నిక్షిప్త పరిచారు. అందుకే ఘంటసాల చనిపోయినప్పుడు అమితమైన విచారంతో

"నువ్వు పోయిన తర్వాత
నేను ఏమి వ్రాసినా
ఎవరు పాడినా ఏముంది?' అంటూ నిర్వేదంతో పలికారు ఆత్రేయ. తాను రాయడంకంటే, ఘంటసాల పాడడమే తన పాటల్ని పది కాలాల పాటు నిలుపుతుందనే భావం ఆత్రేయ భావం ఎంతైనా నిజం. ఆ నిర్వేదంలోనే ఆత్రేయ కోరినట్లుగా

"పాటకొక్కపూటగా అయుర్దాయం
బ్రహ్మ దేవుడు అదనంగా
ఇవ్వగలిగితే"

ఘంటసాల ఇంకా ఎంతో కాలంజీవించే వారే... సినీ జగతిని తన అపూర్వ గానంతో దీవించేవారే !

జ్ఞాపకాలు

గోఖలే గారితో చిత్రానుబంధం

చలనచిత్ర రంగంలో కళాదర్శకత్వానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. తెలుగు చలనచిత్ర సీమలో విజయా సంస్థకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఈ సంస్థ నిర్మించిన "పాతాళభైరవి", "మాయాబజార్", గుండమ్మ కథ వంటి అపురూప చిత్రాలకు గోఖలేతో కలిసి సంయుక్త కళాదర్శకత్వం నిర్వహించిన కళాధర్ గారి జ్ఞాపకాలు. ఈ నెల మీకోసం.



కళాధర్

గోఖలేగా పాపులర్ అయిన వారి పూర్తిపేరు మాధవ పెద్ది గోఖలే. కళాసంపద వారికి వంశపారంపర్యంగా వచ్చిన ఆస్తి. ఆయన ఉత్తమ చిత్రకారుడే గాక పరిణితి చెందిన రచయిత. పల్లెటూరు మాటల తీరును పరిశీలించి సహజధోరణిలో ఉండేలా పాత్రలు సృష్టించి రచన చేసేవారు. అవి చదువుతూ ఉంటే పాత్రలు మన చుట్టూ ఉన్న అనుభూతి కలిగేలా ఎంతో ఆనందాన్ని అందించేవారు. ఆదర్శవాదిగా రచనలు చేస్తూ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని ఎన్నో రకాల కార్టూన్‌లు వేసేవారు. ఎంతో కార్యదీక్షతో పనిచేసేవారు. నాగిరెడ్డి, చక్రపాణి గార్ల నిర్వహణలోని 'చందమామ' మాసపత్రికకు చిత్రకారుడిగా ఉద్యోగంలో చేరి, వారే 1949లో ప్రారంభించిన విజయా ప్రొడక్షన్స్‌లో వారినీ, నన్ను కళాదర్శకులుగా నియమించారు. అప్పటి నుంచి గోఖలేగారు, నేనూ కలిసి సుమారు 20 సంవత్సరాలు మా సేవలను విజయా సంస్థకు అందించాము.

సుమారు 85 చిత్రాలకు కళాదర్శకత్వం వహించిన కళాధర్ వయస్సు 95 యేళ్ళు. ప్రస్తుత నివాసం చెన్నైలో.







మాధవ పెద్ది గోఖలే తో కళాధర్

ఆ రోజుల్లో విజయా, వాహిని సంస్థల నుంచి చిత్రాలు వస్తున్నాయి అంటే ప్రేక్షకులు ఆసక్తితో ఎదురుచూసేవారు. అందుకు కారణం ఆ చిత్రాల్లో సంగీత సాహిత్యాలే కాకుండా సాంకేతిక విలువలు కూడా ఉన్నతస్థాయిలో ఉండేవి. ఒక సందర్భంలో గోఖలే గారితో "మనం ఫలానా హిందీ చిత్రం చూద్దాం" అంటే ఆయన "వద్దు, దాని ప్రభావం మన మీద పడితే మన సృజనాత్మకశక్తి కల్తీ అవుతుందని" అన్నారు. రీమేక్ చిత్రాలకు పనిచేయవలసి వచ్చినప్పుడు సృజనాత్మకకు అవకాశం తక్కువ అనే ఉద్దేశ్యంతో తిరస్కరించిన సందర్భాలు కూడా ఉన్నాయి. డ్రాయింగ్ వేయటానికి ఎంతో శ్రమ, శ్రద్ధ తీసుకుని వొళ్ళుమరచి పనిచేసేవారు. అదే ఆయనకి సంతృప్తి. నేను అనుకున్న పద్ధతిలో పనిచేయగలిగితేనే నేను ఒప్పుకుంటాను. లేకపోతే పనిచేయను అనే నియమానికి కట్టుబడి ఉండేవారు. ఆ కారణంతో చాలా పిక్చర్లు మానుకున్నారు కూడా. అది ఆ జీవితానికున్న ఆదర్శం. ఆ జీవితం అలాగే వెళ్ళిపోయింది. కొన్ని తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు నిర్మాతలు తమ చిత్రాలకు గోఖలే గారిని బ్రతిమాలి చిత్రాలు వేయించుకున్నారు. దానికి కారణం ఆయన వేస్తేనే ఆథారిటేటివ్‌గా, ఆథన్‌టిక్‌గా ఉంటుంది. నాకు పనిలేకపోతే హాయిగా రచయితగా ఇంట్లో కూర్చొని కథలు వ్రాసుకుంటా గాని రాజీపడి పనిచేయవలసిన అవసరం నాకులేదు అని తెగించి చెప్పగలిగే ధీశాలి. గోఖలే గారు సహజత్వానికి దగ్గరలోనే ఫాంటసీ తీసుకు రాగలిగేవారు. అజంతా, ఎల్లోరా, అమరావతి, హంపి శిల్పాలతో పాటు పల్నాడు చిత్రాలను కూడా ఎంతో గొప్పగా చిత్రించేవారు.

పౌరాణిక జానపద చిత్రాలకు ఆయన పెన్నిధి. శ్రీయుతులు యన్.టి.రామారావు, యం.యస్.రెడ్డి, పుండరీకాక్షయ్య, కె.వి.రెడ్డి, నాగిరెడ్డి, చక్రపాణి వీరంతా శ్రీగోఖలేగారి సమర్ధతను చక్కగా ఉపయోగించుకున్నారు. డబ్బు గురించి మరచిపోయి పనినే దైవంగా భావించి వృత్తికి న్యాయం చేయటమే లక్ష్యంగా పెట్టుకున్న మనిషి శ్రీ గోఖలే. మేము 20 సంవత్సరాలు ఒకే కుటుంబ సభ్యుల్లా మెలిగాము. ముఖ్యంగా విజయా సంస్థలో ఎవరు గోఖలే, ఎవరు కళాధర్ అనేది తెలియనంత సన్నిహితంగా కలిసి పనిచేశాము. కొంతకాలం ఎవరు పనులు వాళ్ళు చూసుకుంటూ విడివిడిగా పనిచేశాము. నేను ఆర్ట్ డైరెక్టర్‌గా "ఉన్న పద్ధతులలో సర్దుకుపోతూ తంటాలు పడుతున్నాను" అని అంటే లోలోన సంతోషించేవారే తప్ప తను లొంగివచ్చేవారు కారు.

ఈ కాలంలో ఆర్ట్ డైరక్టర్ పనిలేదు. నేను వెళ్ళిపోతున్నానులే అన్నట్టుగా ఆయన 1981లో కీర్తిశేషులయ్యారు.

తుదిశ్వాస విడిచేవరకు ఆయనకు ఉన్న ఆదర్శాలను వదులుకోలేదు. అదే నా ఆత్మీయ మిత్రుడు మా గోఖలేలోని ప్రత్యేకత.

ప్రొఫైల్

పల్లె అందాలకు ప్రతి రూపాలు కిషన్ చిత్రాలు

ఇంధ్ర ధనస్సులోని వర్ణాలన్నీ చిత్రకారుడి కుంచెలో ఇమిడిపోతాయి. సృష్టి మొత్తం రంగులమయమైతే రంగుల్లో ప్రపంచాన్ని సృష్టించే అపరబ్రహ్మ చిత్రకారుడు, అది మానవుడు నుండి నేటి వరకు ఎందరో చిత్రకారులు మానవ మనుగడకు, నాగరికత నడకకు సాక్ష్యాలు నిర్మిస్తూ చరిత్రకు ఊపిరిపోస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన కప్పరి కిషన్ కుంచె నుంచి జాలువారే చిత్రాలు తెలంగాణ జీవితాలను ప్రతిబింబిస్తాయి. కిషన్ చిత్ర రచనకు స్త్రీ రూపాలు ప్రధాన భూమిక పోషిస్తాయి. ఇవే ఆయన చిత్రకళాప్రస్తానానికి ఊపిరులు ఊదాయి. జాతీయ స్థాయి గుర్తింపును తెచ్చిపెట్టాయి.



కప్పరి కిషన్

హైదరాబాద్‌లో ఏమాత్రం చిత్రకళా నేపద్యంలేని కుటుంబంలో పుట్టిన కప్పరి కిషన్ బాల్యం నుంచీ అందమైన దృశ్యాలు, చిత్రాలు చూసి చిత్రకళపట్ల అభిరుచి పెంచుకున్నాడు. తెలంగాణ ప్రాంతంలోని బతుకమ్మ పండుగ, బోనాలు వంటి తెలంగాణ సంప్రదాయ పండుగలను చూసి చిత్ర రచనకు ప్రేరణపొందారు. ప్రముఖ చిత్రకారుడు టి. వై. కుంఠం తనకు ఆదర్శమని గర్వంగా చెబుతారు కిషన్.

తెలంగాణ పడుచుల అందాలను గీయటమే కాకుండా, వాటి వెనుక ఆమహిళల జీవన





నేపద్యాలను, వాతావరణాన్ని హృద్యంగా, సహజంగా చిత్రించడంలో విజయం సాధించాడు కిషన్. హైదరాబాద్, జవహర్ బాలభవన్‌లో చిత్రకళోపాధ్యాయుడుగా ఉద్యోగం చేస్తున్న కిషన్ చిత్రకళలో డిగ్రీ చేసారు.

కిషన్ చిత్రాలలో కేవలం తెలంగాణ జీవన నేపద్యము, పల్లెపడుచులేగాక,. పాకృతిక సౌందర్యము, శాంతి, సామరస్యాలను తెలియజేసేందుకు తన చిత్రాలకు నేపద్యంగా గౌతమ బుద్ధుడిని తన ప్రతి చిత్రంలోనూ అంతర్లీనంగా చిత్రిస్తారు.

చెక్కలపై చిత్ర లేఖనం: రాతిపై, కాన్వాస్‌పై, పేపరుపై, గాజు పలకలపై చిత్రకళా సృష్టి చేయడం ఇంతవరకు మనం చూసాం. దీనికి భిన్నంగా కిషన్ చెక్క ముక్కలను నలుపలకలుగా కట్ చేసి వాటిపై నాలుగు కోణాల్లోనూ ఆకర్షణీయమైన చిత్రకళా సృష్టి చేసి, తనకో విలక్షణ శైలి క్రియేట్ చేసుకొన్నాడు. ఈ రకమైన చిత్రాలతో కూడా ప్రదర్శనలు నిర్వహించి ప్రశంసలందుకున్నాడు.

తన చిత్రాలతో హైదరాబాద్‌తో పాటు ముంబయి, చెన్నై వంటి నగరాలలో అనేక ప్రదర్శనలు నిర్వహించి జాతీయ స్థాయి చిత్రకారుల ప్రశంసలందుకున్నాడు. చిత్రకళోపాధ్యాయుడుగా జవహర్ బాలభవన్‌లో ఎందరో బాలబాలికలను బావి చిత్రకారులుగా తీర్చిదిద్దుతున్నాడు.






అవార్డులు

- అంబేద్కర్ నేషనల్ ఫెలోషిప్ అవార్డు, న్యూఢిల్లీ
- బెస్ట్ ఆర్టిస్టు అవార్డు - నవరంగ్ ఆర్ట్ అకాడెమీ, విజయవాడ
- బెస్ట్ పెయింటింగ్ అవార్డు - లలిత కళాపరిషత్, విశాఖపట్టణం
- పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్శిటీ అవార్డు, హైదరాబాద్
- హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ వారి అవార్డు
- లలిత కళాసమితి, సిద్దిపేట వారి అవార్డు
- ప్రతిమా ఆర్ట్ అకాడెమీ, గుంటూరు వారి అవార్డు

రెప్లికా ఆర్ట్‌లో "దార్ల"

చిత్ర-శిల్పకళల్లో డిప్లొమా కోర్సు చదువుకొని, హైదరాబాద్ గవర్నమెంట్ ప్రింటింగ్‌ప్రెస్‌లో ఆర్టిస్టుగా ఉద్యోగంలో చేరాడో ఆర్టిస్టు. చేతిలో కళ ఉంది కదా అని కనిపించిన బొమ్మల్లా గీసాడు. బొట్టు బిళ్ళలతో తాజ్‌మహల్ బొమ్మ, స్టెన్సిల్ వర్కులో చార్మినార్ బొమ్మ... ఇలా చాలానే చేసాడు, కాని సంతృప్తి కలగలేదు. కాలం పరిగెడుతుంది. ఇలా హ్యాపీగా ఉద్యోగం చేస్తూ.. కాలం గడిపేస్తే ఎలా? జీవితంలో ఏదో సాధించాలి. నలుగురు నడిచేదారిలో కాకుండా నాకంటూ ఒక ప్రత్యేకత ఉండాలి, నేచేసేపని సమ్‘థింక్’ స్పెషల్‌గా ఉండాలని డిసైడైపోయాడు.. అనుకున్నదే తడవుగా ఈనాడు న్యూస్ పేపరును తీసుకొని మొదటిపేజీని అదే సైజులో జిరాక్స్‌కాపీలా చేతిరాతతో రాచేశాడు. ఫ్రెండ్స్‌కు చూపించాడు. చూసిన వాళ్ళ మైండ్‌బ్లాక్ అయిపోయిందనుకోండి. భలే ఉంది అంటూ అభినందించడమే కాకుండా, ఇంతకు మునుపు ఇలాంటివి చూడలేదు ప్రొసీడ్ అన్నారు. మనం ఏపని చేసిన దానికో పేరుండాలి కదా, అందుకే "రెప్లికా ఆర్ట్" అని నామకరణం కూడా చేసేసాడీ హైద్రాబాద్ ఆర్టిస్టు. అఫ్‌కోర్స్ దీనికి ఆ పేరే కరెక్ట్ అనుకోండి. ఇంతకీ ఆర్టిస్టు పేరేంటి అంటారా? అతనే దార్ల నాగేశ్వరరావు.



సమ్‘థింక్’ స్పెషల్

2004 సం॥లో ప్రారంభించి ఇప్పటికి వరకు సుమారు 14 భారతీయ భాషల్లో ప్రముఖ న్యూస్‌పేపర్లను ఒంటి చేత్తో కాపీ కొట్టేసాడు. అంతే కాదండీ...తనురాసిన పేపర్లతో రాష్ట్రంలో అనేక చోట్ల ప్రదర్శనలు కూడా నిర్వహించడమే కాకుండా, ఇంట్లోనే 'దార్ల ఆర్ట్‌గ్యాలరీ' పేరుతో ఒక మినీ ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటు చేసాడు. ఇదంతా తెలుసుకొన్న లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్ వాళ్ళు



2006 లో దార్ల పేరును నమోదు చేసారు, అంతటితో ఆగకుండా రెప్లికా ఆర్ట్‌లో తన రికార్డును తానే బ్రేక్ చేస్తూ 2008 మరియు 2009 సం॥లో కూడా స్థానం సంపాదించాడు. రెప్లికా ఆర్ట్‌లో దార్ల నాగేశ్వరరావు కృషిని అభినందిస్తూ రాయని పేపరు లేదు-ప్రసారం చేయని టీవీచానల్ లేదంటే అతిశయోక్తి కాదు.రెప్లికా ఆర్ట్ అంటే దార్ల దార్ల అంటే రెప్లికా ఆర్ట్ అన్నంత గుర్తింపు ఆంధ్రదేశంలో తెచ్చుకున్నారు.

ఓన్లీ కళాసాధనేనా కళాపోషణ ఏమైనా ఉందా అనుకొంటున్నారా? ఆగండి... అక్కడికే వస్తున్నా ప్రతీ సంవత్సరం ముగ్గురు కళాకారులను ఎంచుకొని నగదు బహుమతులు అందంచడమే కాకుండా, తను నివసిస్తున్న సరూర్‌నగర్ (హైదరాబాద్) జిల్లా పరిషత్ స్కూల్‌లో పదవతరగతి పరీక్షలతో ప్రతిభ కనబర్చిన మొదటి 8మందికి-వారికొచ్చిన మార్కులకు సరిసమానంగా రూపాయలను చెక్ రూపంలో అందిస్తూ విద్యార్థులనుకూడా ప్రోత్సహిస్తున్నారు.





దార్ల నాగేశ్వరరావు

గురించి....

పుట్టింది	:	జనవరి 12, 1959, తెనాలిలో, గుంటూరు జిల్లా
తల్లిదండ్రులు	:	కీ॥శే॥ దార్ల అప్పారావు, శ్రీమతి సావిత్రి
చదువు	:	సాంప్రదాయ చిత్రకళ-శిల్పకళలలో డిప్లొమా (1978) స్క్రీన్‌ప్రింటింగ్ అండ్ ఫొటోగ్రఫీ కోర్సు (1979)
ప్రస్తుత ఉద్యోగం	:	గవర్నమెంట్ సెంట్రల్‌ప్రెస్, చంచల్‌గూడా, హైద్రాబాద్‌లో ఆర్టిస్టుగా 1985 సం॥ నుండి.
ప్రదర్శనలు	:	హైద్రాబాద్, విజయవాడ, వైజాగ్, అమలాపురం, కాకినాడ తదితర చోట్ల రెప్లికా ఆర్ట్ ప్రదర్శనలు
అవార్డులు	:	ట్రిపుల్ లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, కోనసీమ చిత్రకళాపరిషత్, అమలాపురం వారి చిత్రకళావైజయంతి పురస్కారం, రెప్లికా కళాప్రవీణ బిరుదు.
కుటుంబం	:	భార్య శ్రీమతి జ్యోతికుమారి, కుమారులు కార్తీక్, శ్రావణ్
అభిరుచులు	:	కళాకారులతో సాంగత్యం, ఫొటోగ్రఫీ, ఇంటర్నెట్
ఇ-మెయిల్	:	replicartist_newspapers@yahoo.co.in


ఆధునిక చిత్రకళకు ఆద్యుడు - పికాసో

ఆధునిక చిత్రకళకు ప్రముఖ మేధావులు విభిన్న భాష్యాలు చెప్పారు.

"అదొక మానసిక వికారాల మాయా ప్రపంచం "అని ఒకరంటే...

"మానవమేధ అందుకున్న మహోన్నత స్థాయికి అదొక వర్ణదర్పణం" అని మెచ్చుకున్నారు మరొకరు...

"అం... ఇదంతా చెత్త" అని ఒక్కమాటలో తీసిపారేశారు ఇంకొకరు....



- సుంకర చలపతిరావు

ఇలా ఎవరేమన్నా ఆ చిత్రకళ మాత్రం సజీవంగా మనముందున్నది. ఆ ప్రక్రియ ప్రాణం పోసుకున్న నాటి నుంచి నేటిదాకా జరిగిన, జరుగుతున్న చర్చలెలా ఉన్నా అవి లేని విశ్వవిఖ్యాత మ్యూజియం ఏదీలేదనేది మాత్రం యథార్థం.

ఖరీదైన కళాఖండాల్ని వేలం వేసే ప్రపంచ ప్రఖ్యాత సంస్థ -'సౌత్ బే'-ఆధునిక చిత్రకళకు సమకాలీన వాణిజ్య జగత్తులో ఉన్న విలువేమిటో కొద్దివారాల కిందే ప్రపంచానికి ప్రత్యక్షంగా చెప్పింది.

నేటికి దాదాపు 70 ఏళ్ళ క్రితం చిత్రించిన 'ఉద్యానవనంలో కూర్చున్న స్త్రీ' అనే చిత్రంతో పాటు, మరో చిత్రం 'సౌత్ బే' గ్యాలరీ నిర్వహించిన బహిరంగ వేలం పాటలో సునాయాసంగా అమ్ముడుపోయాయి. ఎంతకంటే... ఆరెండు పెయింటింగుల విలువ మనరూపాయల్లో సుమారుగా అక్షరాలా నాలుగు వందల ఇరవై మూడు కోట్లు మాత్రమే! నమ్మలేనంత ఆశ్చర్యకరంగా, మహామాయాజాలంలా ఉన్నా, అంత ధర పలికిన చిత్రాలు సాధారణ వ్యక్తివి కావు. 20వ శతాబ్దిలో సాటిలేని మేటి ప్రతిభాశాలి 'పికాసో'వి. పికాసోదే మరో పెయింటింగ్ ఒకటి నేటికి సరిగా ఇరవైయ్యేళ్ల క్రితమే 230 కోట్ల రూపాయలకు అమ్ముడుపోయింది.

మనకివి అద్భుత విషయాలు కావచ్చు. కాని, పారిశ్రామికంగా ఎదిగిన యూరప్‌లో ఇవన్నీ మామూలే. పికాసోదే మరో పెయింటింగ్‌ను జపాన్‌కు చెందిన ఓ పెద్దమనిషి కేవలం ఫోన్‌లో వేలంపాడి ఏడుకోట్ల డాలర్ల చిల్లరకు కొనేశాడు. అంటే, మన రూపాయల్లో దాదాపు 315 కోట్లు. పికాసో సంతకం ఉన్న చిత్తుకాగితం ముక్క కూడా విపరీతమైన ధరకు అమ్ముడయిపోతుందంటే ఆశ్చర్యపడాల్సిందేమీలేదు. ఇంతగా ఆధునిక చిత్రకళా ప్రపంచంలో లబ్ధప్రతిష్ఠుడయ్యారు పికాసో!

పాబ్లోరుయిజ్ పికాసో స్పెయిన్‌లోని 'మలగా'లో 1881 అక్టోబరు 25న జన్మించాడు. తండ్రి సాధారణ చిత్రకారుడు. తండ్రి నుంచి చిత్రకళను పుణికిపుచ్చుకున్న పికాసో బాల్యదశలోనే తోటివారిని ఆశ్చర్యపరిచే అసాధారణ నైపుణ్యాన్ని ప్రదర్శించేవాడు. కళ్ళెదుటి దృశ్యాల్ని చూస్తూ చూస్తూనే క్షణాల్లో కాగితంపై పెట్టేవాడు. తొమ్మిదో ఏటే పికాసో గీసిన చిత్రాలు అందర్నీ అబ్బురపరిచాయి. 1885లో ఆయన కుటుంబం బార్సిలోనాకు



మారింది. తన ప్రతిభతో అక్కడి ప్రఖ్యాత స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో సీటు సంపాదించాడు. ఆ తర్వాత మాడ్రిడ్‌లోని ఆర్ట్స్ అకాడమీలో చేరాడు. 1900లో పారిస్ పర్యటనకు వెళ్ళిన పికాసో నాలుగేళ్ల తర్వాత అక్కడే స్థిరపడ్డారు. కళారంగంలో సంచలనంగా, సరికొత్త చిత్రకళాభాషగా పేర్కొనే 'క్యూబిజం'కు ప్రాముఖ్యాన్ని సంపాదించిపెట్టింది. ఆయన పెయింటింగ్సే! ఆఫ్రికన్ శిల్పాల్ని అటవికులవిగా భావించే రోజుల్లో వాటిలోని కళాత్మకతను, సహజత్వాన్ని అర్థంచేసుకుని, ప్రపంచానికి చూపినవాడు పికాసో.

అన్నిటికన్నా ప్రధానంగా పికాసో చిత్రాల్లో మహత్తరమైనదిగా అంతా పేర్కొనేది –"గెర్నికా", అంతర్యుద్ధ ఫలితంగా మాతృదేశం స్పెయిన్ వినాశనాన్ని ప్రతిబింబించిన ఈ చిత్రం అందర్నీ అద్భుతంగా ఆకట్టుకుంది. దీనిలో రంగులంటూ ఏవీ లేకపోవటం ఒక ఆశ్చర్యకరాంశం. చిత్రంలోని రూపాలన్నింటినీ కేవలం నలుపు, నలుపు తాలూకు లేద ఊదాతోనే చిత్రించారు. అన్ని పెయింటింగ్స్‌లా దీన్ని వేసింది కాగితం మీదో, కాన్వాస్ మీదోకాదు. గోడమీద వేశారు. "ఎంత ప్రయోగశాలియో, ఎంత ప్రఖ్యాతుడో అంత వివాదాస్పద కళాకారుడు"గా పేరొందిన పికాసో నాజీ జర్మనీ దురాక్రమణలోని పారిస్‌లో ఉంటూ నాజీలను విమర్శిస్తూ అనేక చిత్రాలు వేశాడు.


పికాసో చిత్రాల్లో ప్రఖ్యాతమైనవన్నీ కళా విమర్శకులు విడమర్చి చెపితే తప్ప అర్థం కానివే! అయినా తొలిదశలో ఎవరూ అర్థాలు చెప్పనక్కర్లేని 'కదిలేవీ... కదిలించేవీ...'' కూడా చిత్రించాడు పికాసో. 20వ ఏటనే వేసిన "మదర్" అనే చిత్రం ఇందుకు ఉదాహరణ. అమెరికాలోని సెయింట్‌లూయిస్ సిటీ ఆర్ట్‌మ్యూజియంలో ఉందిది.

"కళ ప్రజలకోసం" అనేవారి దృష్టిలో అత్యంతాధునిక కళా ప్రయోగాలన్నీ మానసిక వెర్రులే. కాని, ఆ వాదానికి మూలవిరాట్టులైన ఫ్రెంచి కమ్యూనిస్టు పార్టీలో పికాసో ఒకప్పుడు

సభ్యుడు. ప్రపంచ శాంతి సంఘంలోనూ ఆయన కృషి చేశారు. మన మీనాడు శాంతికి చిహ్నంగా వాడుతున్న పావురాయిని ప్రచారంలోకి తెచ్చింది పికాసోయే! ప్రపంచ శాంతి సంఘం పికాసో వేసిన పావురం చిహ్నాన్ని ఉపయోగించిన నాటి నుంచి అది శాంతకపోతమైంది.

నిజానికి పికాసో ప్రత్యేకంగా ఏ ఒక్క "ఇజం"కూ కట్టుబడలేదు. మార్పులకు అనుగుణంగా మారుతూపోయాడు. ఆయన ప్రయోగాలు అసంఖ్యాకం. ఆయన కళ 'ఫలనాదీ'... అని నిర్వచించటం ఎవరికీ సాధ్యం కాదన్నంత వైవిధ్యాన్ని పికాసో ప్రదర్శించారు. అలాగే కళాసృష్టికి అవధులు లేవన్నంత విపరీతంగా చిత్రిస్తూ శిల్పిస్తూ వచ్చారు.

92 ఏళ్లు ఆరోగ్యంగా బతికి, ప్యారిస్‌లో 1973లో ఏప్రిల్ 8న కీర్తిశేషుడైన పికాసో వాస్తవానికి తన జీవిత కాలంలోనే అఖండ కీర్తినొందాడు. ఆయనపై ఎన్నివేల పరిచయ, సమీక్షా, విమర్శా రచనలు వచ్చాయో లెక్కించిన వారెవరూలేరు. పుస్తకాలు, ఆయనచిత్రాల అల్బమ్‌లే వందల సంఖ్యలో వచ్చాయి. అందుకే నేటికీ ప్రపంచ చిత్రకారుల్లో మొదటిస్థానం పికాసోదే.




విశేషమేమంటే తన చిత్రాలను ప్రజలు వేలంవెర్రిగా అభిమానించటం చూసి, చివరికోరోజు... "నా చిత్రాల్లో మీరు ఊహించుకుంటున్నదేదీలేదు. నేనింత కాలం మిమ్మల్ని భ్రమల్లో ఉంచాను" అని ప్రకటించారు. అందుకు నివ్వెరపోయిన కళాప్రపపంచం తేరుకుని నవ్వేసింది. 'పికాసో' జోకులు వేయటంలోనూ ఘనుడు సుమా!" అని నసిగి ఊరుకుంది. ఇదన్నీ జరిగి, ఆయన చనిపోయి 26 ఏళ్ళయిన తర్వాత కూడా పికాసో పెయింటింగ్‌లు కోట్లాది రూపాయల ధర పలుకుతున్నాయి.

పికాసో ఎంత విఖ్యాతుడో జీవితంలో అంత నిరాడంబరుడు. అయిదారుగురు భార్యలకు విడాకులిచ్చి పంపినా అందరికీ అనంతమైన సంపద మిగిల్చేవెళ్లారు. సందర్శకులు, కళావేత్తలు ఎవరొచ్చినా కూడా కేవలం నిక్కర్‌లాంటి అండర్‌వేర్‌తోనే దర్శనమిచ్చేవారు. అలాగే పనులు చేస్తుండేవారు... ఇంటర్వ్యూలూ ఇచ్చేవారు.

ఆధునిక చిత్రకళలో మూడక్షరాల తారకమంత్రం –పికాసో. రకరకాల ప్రయోగాలెన్ని చేసినా ఎవరితోనూ, ఏ ఇజాలతోనూ పోలికలేకుండా తనే అత్యంతాధునిక కళకు ఒక సజీవోదాహరణగా జీవించారు. కేవలం పెయింటింగ్‌లకే పరిమితం కాకుండా.. జిజ్ఞాసతో శిల్పాల్ని చిత్రించారు. ప్రింట్‌లు వేశారు. పింగాణి పాత్రలపై చిత్రాల్ని గీశారు. శిలాముద్రణలో సాంకేతిక ఆవిష్కరణలు చేశారు. ఆధునిక యుగంలోని విశ్వకళాచరిత్రలో ఆయనకు సాటి మరొకరులేరు.



ఓకే...
ఏవిఎమ్
సెల్‌ఫోన్ సరిగమలు
సారీ...


దీపావళి చిరునవ్వులు


ఈ ప్రపంచంలో మనన్నెవరూ విడదీయలేరు పద్మా...!
ఏం.. జైల్లో వుంటే మాత్రం.. దీపావళి..... దీపావళి కాకుండా పోతుందా..? నోర్మూసుకొని పడుకోండి..!
దీపావళి పూట పిల్లలు.. నల్లబాంబులు కాల్చుకోడానికి కూడా... నోచుకోలేదు ఈ ఇంట్లో..!
K. రాంబాబు బాంబుస్టాల్
9849570864
అయ్యో... బాంబులు పేలడం కాదు అత్తయ్యా... అది మీ మనవడి సెల్ రింగుటోను అంతే...!
ఢాం ఢాం
అయ్యో.. చెవ్వులు మూస్తే చిన్న... అదంతే. అక్కడేం మీ ఉండదు... కానీ.. ధామ్మంటుంది....
మాయానంద్ మెజీషియన్



ఇంటర్నెట్ పుణ్యమాని -- అమెరికా నుండే
మా అబ్బాయి -- ఇక్కడ... ఇవి కాలుస్తున్నాడు... చూశారా....
ఢాం
ఢాం






డాడీ! కాసేపు కంప్యూటర్ మాకివ్వండి-
మాక్కావల్సిన క్రేకర్స్‌ని.. డౌన్‌లోడ్
చేసుకుంటాం!!



చూశారుగా- మా కంపెనీ బాంబులు
ఎంత గట్టిగా- బ్రహ్మాండంగా పేలుతు
న్నాయో..! కాబట్టి... మా కంపెనీ బాంబు
లనే కాల్చండి...!
ఢాం
ఢాం
ఢాం
ఢాం
ఢాం


నన్నుప్రేమించు కాదంటే నీ భరతం పడతా...!


ఈమె వింకరింగ్... పరమ చెత్త గురూ !!



ఢాం
సరదాల దీపావళి
వి.రామకృష్ణ
9440618122
లక్ష్మీ బాంబులు కావాలా? మామూలు బాంబులు కావాలా?
మానవ బాంబులు కావాలి నాన్న...!!
అర్జునా ఆ బాణాలు వేయటం కాదు.. ఈ బాంబు కాల్చు...నా ఓటమిని అంగీకరిస్తా....!!
ఈ బాంబు కాల్చినవారికే మంత్రిపదవి ఇస్తారట...!!
పార్టీకార్యాలయం
BOMB
టపాసుల ధరలు పెరిగాయని...ఇలా ఏర్పాటు చేసా...!!
ఢాం
ఢాం
BUS STOP
దీపావళి బాంబుల పోటీ
ENTRY
ప్రథమ బహుమతి 1 kg బంగారం
రెండవ బహుమతి మారుతీ కారు
మూడవ బహుమతి రెండు బైకులు
మరియు అనేక బహుమతులు